ప్రతిపక్షం

www.prathipaksham.in

ఆదివారం 14.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 264 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu



తెలుగు ప్రజలను కలవడం సంతోషం: మెస్సీ 3



19వ తేదీ డెడ్ లైన్

తేలనున్న 'ఫిరాయింపుల' వ్యవహారం!

ఇప్పటికే రెండుసార్లు 'సుప్రీం' హెచ్చరిక

- కోర్టు ధిక్కరణగా పరిగణిస్తామని అల్టిమేటమ్
- పట్టు వదలకుండా వెంటాడుతున్న బీఆర్ఎస్
- బెంగాల్ హైకోర్టు తీర్పు పునరావృతమవుతుందా!
- నోటీసులకు జవాబివ్వని కడియం, దానం
- ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై తీర్పు రిజర్వ్
- స్పీకర్ ప్రసాద్ కుమార్ నిర్ణయమే ఫైనల్
- న్యాయసలహా తీసుకున్న తరువాత జడ్జిమెంట్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 13: రాష్ట్రంలో పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలపై ఈ నెల 19వ తేదీ లోపల స్పీకర్ ప్రసాద్‌కుమార్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఎనిమిది మందిపై విచారణ పూర్తి చేసి నిర్ణయాన్ని రిజర్వ్ చేసిన స్పీకర్ మరో ఇద్దరు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరికి రెండు సార్లు నోటీసులు జారీ చేశారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విషయమై న్యాయసలహా తీసుకుని వీలైనంత త్వరలో స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్పీకర్ విచారణ నిర్వహిస్తున్నారు. ఫిరాయింపు ఆరోపణల ఎమ్మెల్యేలలో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ నుంచి కడియం శ్రీహరి, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు, రాజేంద్రనగర్ నుంచి టి.ప్రకాష్ గౌడ్, బాన్సువాడ నుంచి పోచారం శ్రీనివాస్ రెడ్డి, చేవెళ్ల నుంచి కాలే యాదయ్య, జగిత్యాల నుంచి డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల నుంచి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, శేరిలింగంపల్లి నుంచి ఆరెకపూడి గాంధీ, పటాన్ చెరు నుంచి జి.మహిపాల్ రెడ్డి

...:: మిగతా 2లో

మిస్సింగ్ అయిన మహిళల కుటుంబాల జీవితం ఒక్కసారిగా ఆగిపోతుంది. ప్రతి ఫోన్ కాల్ ఓ ఆశ. ప్రతి తెలియని సమాచారం ఓ భయం. పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల చుట్టూ తిరుగుతూ కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నాయి. కొన్నిచోట్ల సమాజపు ఒత్తిళ్లు, అపవాదులు కూడా ఈ కుటుంబాల్ని వెంటాడుతున్నాయి. షీ–టీమ్స్, హెల్ప్‌లైన్లు, కఠిన చట్టాలు ఉన్నప్పటికీ, మిస్సింగ్ కేసుల సంఖ్య తగ్గకపోవడం మహిళల భద్రతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. 'మహిళలు నిజంగా సురక్షితమేనా?' అన్న ప్రశ్నకు సమాధానం దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ కథ తెలంగాణ అంతటా ప్రతిధ్వనిస్తోంది.



అదృశ్యమైన చిరునవ్వులు

మహిళలు, యువతుల మిస్సింగ్

కరీంనగర్ పరిధిలో 567 మంది

- జనవరి 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు
- తెలంగాణ రాష్ట్రంలో 5 వేలకు పైగానే
- ఫిర్యాదు చేయని కేసులతో సంఖ్య రెండింతలు!
- కొందరి ఆచూకీ దొరికింది, చాలా మంది కనిపించలే!
- తల్లి కళ్లలో నీరు, తండ్రి ముఖంలో నిస్సహాయత
- ఇది ఒక్క ఇంటి కథ కాదు. ఎన్నో ఇండ్ల బాధ
- కుటుంబాలకు కుటుంబాలు తలకిందులు
- అటు షీ–టీమ్స్, హెల్ప్‌లైన్లు, కఠిన చట్టాలు
- ఇటు కొనసాగుతూనే ఉన్న అదృశ్యాలు

వడ్లకొండ సదానందం

ప్రతిపక్షం ఉత్తర తెలంగాణ ప్రతినిధి, కరీంనగర్, డిసెంబర్ 13 : ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్. రోజులు గడుస్తున్నాయి. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న తల్లి కళ్లలో నీరు, తండ్రి ముఖంలో నిస్సహాయత. ఇది ఒక్క కుటుంబ కథ కాదు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనే ఇటీవలి 22 నెలల్లో వందలాది కుటుంబాలు అనుభవిస్తున్న బాధ ఇది. జనవరి 2024 నుంచి అక్టోబర్ 2025 వరకు కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 567 మంది మహిళలు, యువతుల మిస్సింగ్ కేసులు అధికారికంగా నమోదు అయ్యాయి. ఇవి కేవలం పోలీస్ రికార్డుల్లో ఉన్న లెక్కలే. పోలీసుల దృష్టికి రాని అనధికారిక కేసులు వీటికంటే చాలా ఎక్కువగా ఉండొచ్చని అంచనాలు వేస్తున్నారు. నమోదైన కేసుల్లో కొన్నింటినే పోలీసులు ఛేదించగలిగారు. మిగిలిన అనేక కేసులు ఫైళ్లలోనే దుమ్ము పట్టుకుంటున్నాయి. అదృశ్యమైన

...:: మిగతా 2లో

విద్యారంగంలో సమూల మార్పులు

- నాణ్యమైన విద్య లక్ష్యంతో నిర్ణయాలు
- విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి
- హైటెక్స్‌లో ఈటీ టెక్ ఎక్స్ కార్యక్రమం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్13 :- మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యావ్యవస్థలో సమూలమైన, విప్లవాత్మక మార్పులకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాలుగా విద్యారంగాన్ని అత్యున్నత ప్రాధాన్యత అంశంగా గుర్తించి, "విద్యార్థులకు నాణ్యమైన విద్య" అనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని మంత్రి స్పష్టం చేశారు. పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి నుంచి ఉపాధ్యాయుల భర్తీ, డిజిటల్ లెర్నింగ్, స్కిల్ ఎడ్యుకేషన్ వరకు విద్యారంగంలోని ప్రతి దశలో సమగ్ర మార్పులు తీసుకువస్తున్నామని మంత్రి తెలిపారు. బ్రెయిన్ ఫీడ్ గ్రూప్ ఆధ్వర్యంలో హైటెక్స్‌లో నిర్వహించిన ఈటీ టెక్ ఎక్స్– 6వ ఎడిషన్ కార్యక్రమానికి శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో వేగంగా మారుతున్న విద్యా ప్రపంచంలో ఈటీ టెక్ ఎక్స్ వంటి వేదికలు అత్యంత అవసరమని, టెక్నాలజీ–విద్య కలిసి భవిష్యత్తును ఎలా నిర్మించాలి అనే అంశంపై ఆలోచించేందుకు, చర్చించేందుకు ఇవి



దిశానిర్దేశం చేస్తున్నాయని అన్నారు. కుల, మత భేదాలకు అతీతంగా విద్యార్థులందరూ ఒకే క్యాంపస్‌లో అన్ని సౌకర్యాలతో కలిసి చదువుకునేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 2024 డీఎస్సీ ద్వారా పది వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అదే విధంగా, యువత పరిశ్రమలకు తగిన నైపుణ్యాలు నేర్చుకునేలా ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. విద్యతో పాటు క్రీడలకు కూడా తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. అన్ని చర్యలతో విద్యార్థులకు విస్తృత అవకాశాలు లభిస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు బలపడతాయని,రాష్ట్రంలో వృత్తి ఆధారిత విద్యకు బలమైన పునాది పడుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



నేడే మలిదశ పంచాయతీ

- పోలింగ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- 3,911 గ్రామాల సర్పంచుల ఎన్నిక
- బరిలో నిలిచిన 13,128 అభ్యర్థులు
- ఉదయం 7 నుంచి పగలు 1 వరకు పోలింగ్
- 2 గంటల నుంచి కౌంటింగ్, ఫలితాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 13: తెలంగాణ రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల గురించే మాట్లాడుకుంటున్నారు. గెలుపు కోసం పార్టీ అభ్యర్థులు తమ ప్రయత్నాలు గట్టిగానే చేస్తున్నారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా 3,911 గ్రామాలలో రెండోదశ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. 13,128 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉండగా, 29,903 వార్డులకు 78,158 వార్డు సభ్యులు బరిలో నిలిచారు. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి కౌంటింగ్ జరిగి ఫలితాలు రానున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం శనివారం సిబ్బందికి ఎన్నికల సామాగ్రిని

...:: మిగతా 2లో



ఈటల X సంజయ్

- బీజేపీలో మరోమారు భగ్గుమన్న విభేదాలు
- సంజయ్ పీఆర్వో పోస్టులతో బహిర్గతం
- స్థానిక ఎన్నికలయ్యాక అన్ని విషయాలు బయటపెడతా
- నేను ఏ పార్టీలో ఉండాలో ప్రజలే తేలుస్తారు
- ఎంపీ ఈటల రాజేందర్ షాకింగ్ కామెంట్స్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్13: తెలంగాణ బీజేపీలో మారోమారు విభేదాలు భగ్గుమన్నాయి. తెలంగాణ బీజేపీలో కోల్డ్ వార్ కొనసాగుతోంది. ప్రధాని మోడీ రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేసినా మార్పు కనిపించటం లేదు. పంచాయతీ ఎన్నికల వేళ తమ మద్దతుదారులను బరిలోకి దింపటం, ఫలితాలపైన చేసిన పోస్టింగులు వివాదాలకు కారణం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత కొంత కాలంగా కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్‌మధ్య ఉన్న విభేదాలు సోషల్ మీడియాలో పోస్టింగులతో

...:: మిగతా 2లో

ఏఐ సహకారంతో బీజేపీని ఓడిస్తాం

- విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా పనిచేస్తాం
- ఎన్నికల్లో బీజేపీ గెలవడానికే ఎస్ఐఆర్
- యూపీలో 3 కోట్ల ఓట్ల తొలగింపునకు ప్రయత్నం
- ఏఐ సాంకేతికతతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు
- విజన్ ఇండియా సమ్మిట్లో యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్13: ఉత్తర ప్రదేశ్ లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించుకొని బీజేపీ పార్టీని ఓడిస్తామని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు, ఉత్తర ప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ అన్నారు. తాము విభజన రాజకీయాలకు వ్యతిరేకమని, దానికి అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా విజన్ ఇండియా ద్వారా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. సానుకూల, అభివృద్ధి, ప్రగతిశీల రాజకీయాలే చేస్తామని తెలిపారు. సమాజ్ వాది పార్టీ అధ్యర్యంలో శనివారం హైదరాబాద్ లో జరిగిన విజన్ ఇండియా సమ్మిట్లో అఖిలేష్‌యాదవ్ పాల్గొన్నారు.



పరిపాలనలో సాంకేతికత వినియోగం, భవిష్యత్తులో సాంకేతికత రూపాంతరం వంటి అంశాలపై యువతలో అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో ఆ పార్టీ అన్ని ప్రధాన పట్టణాల్లో విజన్ ఇండియా సమ్మిట్లను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ... రైతులకు, మౌలిక సదుపాయాల కల్పనకు, పట్టణీకరణ, పట్టణాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్య పరిష్కారం, ఆరోగ్య, తదితర రంగాల్లో ఏఐ టెక్నాలజీని సమర్థవంతంగా

...:: మిగతా 2లో



ఫీజు పెంచే అధికారం ట్రంప్‌కు లేదు

హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ నిర్ణయాన్ని అడ్డుకోవాలని కోరుతూ కాలిఫోర్నియాతోపాటు మరో 19 అమెరికన్ రాష్ట్రాలు శుక్రవారం బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి.

7



ముంబైలో అనుమానిత బ్యాగుల కలకలం

ముంబయిలోని బాంద్రాలో 2 బ్యాగులు తీవ్ర కలకలం రేపాయి. బాంద్రాలోని లింకింగ్ రోడ్‌లో నేషనల్ కాలేజ్ ఎదురుగా రెండు అనుమానాస్పద బ్యాగులు చూసి జనం భయంతో పరుగులు తీశారు.

7



ప్రజా తీర్పును గౌరవించాలి..

తిరువనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ ని కాంగ్రెస్ పార్టీ తిరువనంతపురం ఎంపీ శశథరూర్ అభినందించారు.

7



'చిన్నస్వామి'లో మ్యాచులకు షరతులు

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం మళ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లతో కళకళలాడనుంది. తొక్కిసలాట తర్వాత వెలవెలబోతున్న ఈ మైదానంలో మ్యాచ్‌ల నిర్వహణకు కర్నాటక ప్రభుత్వం పచ్చజెండా ఊపింది.

8

రాష్ట్రీయం

సింగరేణి సుస్థిర మనుగడ కోసమే దృష్టి

- కొత్త బ్లాకులు సాధించేందుకు చొరవ చూపాలి
- సింగరేణి ఉన్నతస్థాయి సమీక్షలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపు



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13: సింగరేణి సుస్థిర మనుగడ కోసం తక్షణమే తన బొగ్గు ధరల తగ్గింపు, నాణ్యత పెంపుదలపై దృష్టి సారించాలని, కొత్త బ్లాకులు సాధించడానికి చొరవ చూపాలని, కార్మిక సంక్షేమంలో ఎలాంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్లో ఆయన శనివారం సింగరేణి సంస్థపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. బొగ్గు రంగంలో తాము కొన్ని సంస్కరణలు తీసుకురాబోతున్నామని, ఇకపై ప్రభుత్వ సంస్థలు పూర్తి అంకితభావంతో పనిచేస్తే తప్ప వాటిని ఎవరూ రక్షించలేరని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నూతన కార్మిక చట్టాలను అమలులోకి తీసుకొచ్చామన్నారు. వీటిని పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. కొత్త బ్లాకులను సాధించడం కోసం ప్రణాళిక బద్ధంగా పనిచేయాలన్నారు.



స్టార్టప్‌లకు ఆటా ప్రోత్సాహం అభినందనీయం

- ఆటా స్టార్టప్ పిచ్ డే కార్యక్రమంలో వక్తలు
- ఐఐటీ హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13: ఐటీ రంగంలో స్టార్టప్ కంపెనీలను అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) ప్రోత్సహించడం అభినందనీయం అని పలువురు ఐటీ రంగ ప్రముఖులు కొనియాడారు. శనివారం అమెరికా తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న 'ఆటా వేడుకలు-2025'లో భాగంగా ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (విద్యాశాఖ), ఐఐటీ హైదరాబాద్ సహకారంతో ఐఐటీ క్యాంపస్‌లో ఆటా స్టార్టప్ పిచ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ స్టార్టప్‌లకు నిధుల అవకాశాలు, మెంటార్‌షిప్, పరిశ్రమల అనుసంధానం కల్పించడమే లక్ష్యంగా ఈ పిచ్ డే నిర్వహించామని ఆటా ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా స్టార్టప్ వ్యవస్థాపకులు, పెట్టుబడిదారులు, విద్యా సంస్థలు, ఐటీ రంగ నిపుణులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. స్టార్టప్‌లను ప్రోత్సహించడం, వాటికి నిధులు, దిశ నిర్దేశం అందించడం, గ్లోబల్ నెట్‌వర్క్‌ను నిర్మించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటా ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఎలెక్ట్ ప్రెసిడెంట్ సతీష్‌రామ సహాయంరెడ్డి, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు

దేశంలో స్టార్టప్ ఎకోసిస్టం వేగంగా విస్తరిస్తోందని, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలు, మైతీ స్టార్టప్ హబ్ అందిస్తున్న సహకారం వల్ల యువ ఇంజనీర్లకు అనేక అవకాశాలు లభిస్తున్నాయని మైతీ స్టార్టప్ హబ్ సీఈఓ డా. పన్నీర్ సెల్వం మదనగోపాల్ పేర్కొన్నారు. టెక్నాలజీ ఆధారిత ఆవిష్కరణలే భవిష్యత్ ఆర్థిక వృద్ధికి పునాదని స్పష్టం చేశారు. అలాగే ఏఐ కూడా భవిష్యత్‌కు నూతన నాంది పలుకుతుందన్నారు. పిచ్ డేలో పాల్గొన్న స్టార్టప్‌లు తమ వ్యాపార ఆలోచనలు, ఉత్పత్తులు, సేవలను కాంపిటీషన్ న్యాయనిర్ణేతలు పరీక్షించి, ఉత్తమ స్టార్టప్‌లను ఎంపిక చేశారు. భారతదేశం-అమెరికా మధ్య స్టార్టప్ సహకారాన్ని మరింత బలోపేతం చేయడంలో ఆటా స్టార్టప్ పిచ్ డే కీలక మైలురాయిగా చరిత్రలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఘనంగా శ్రీ రాధా గోవింద రథయాత్ర

- పాల్గొన్న వేలాది మంది భక్తులు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13 : హరేకృష్ణ మూమెంట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 4వ వార్షిక శ్రీ రాధా గోవింద రథయాత్ర శనివారం కోకాపేటలో అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక ఉత్సాహంతో జరిగింది. ఈ మేరకు వేలాది మంది భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో, సంస్కృతి, సాంప్రదాయాలతో రథయాత్రను మహోత్సవంలా జరుపుకున్నారు. ఈ మేరకు రథంపై రాధా గోవిందుల సుందరమైన విగ్రహాలు దివ్య రూపంలో విరాజిల్లగా, భక్తులు అపారమైన ఉత్సాహంతో రథాన్ని ముందుకు లాగారు. రథయాత్ర మార్గంలో భక్తులు సంకీర్తనలు, భజనలతో మార్మోగించారు. ఈ క్రమంలోనే భక్తులకు ప్రసాదం పంపిణీ, ఆధ్యాత్మిక సేవలతో కోకాపేట ప్రాంతం అంతా శోభాయామానంగా మారిపోయింది. శ్రీ కృష్ణ గోసేవ మండల గోశాలలో ప్రారంభమైన రథయాత్ర, గండిపేట మెయిన్ రోడ్ 'వై' జంక్షన్ నుంచి కోకాపేట 'ఎక్స్' రోడ్, అల్లు స్టూడియోస్, 7 హిల్స్ గేటెడ్ కమ్యూనిటీ, రాజపుష్ప అత్రియా, గోల్డెన్ మైల్ రోడ్ మీదుగా హరేకృష్ణ హెరిటేజ్ టవర్ ప్రాజెక్టు స్థలానికి చేరుకుంది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక హాజరయ్యారు. హరేకృష్ణ మూమెంట్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తన ప్రవచనంలో ప్రభూజీ, రథయాత్ర యొక్క చారిత్రక గురించి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత, శ్రీ చైతన్య మహాప్రభువు సంకీర్తన ఉద్యమం, విశ్వగురు శ్రీల ప్రభుపాదుల ప్రపంచ వ్యాప్త కృష్ణభక్తి ప్రచార యజ్ఞంతో అనుసంధానిస్తూ వివరించారు.



ఆర్యవైశ్య సర్పంచులకు సన్మానం

ప్రతిపక్షం, షాద్‌నగర్, డిసెంబర్13: ఆర్యవైశ్య సంఘం అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నియోజకవర్గం కొత్తూరు మండలం గూడూరు సర్పంచ్ గా ఎన్నికైన ఉప్పల దయానంద్ గుప్తా, ఫరూక్‌నగర్ మండలం భీమారం గ్రామ సర్పంచ్ గా ఎన్నికైన ఎలుకుర్తి గీత వీరేశం గుప్తా లను ఘనంగా సన్మానించారు. పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పట్టణ అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస గుప్తా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయం సాధించిన సర్పంచులను శాలువా జ్ఞాపకతో సన్మానించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కృషి చేసి సమాజంలో మంచి గుర్తింపు సాధించి మరిన్ని పదవులు ఆశించాలని ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు సర్పంచులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం షాద్నగర్ కార్యదర్శి గందే శంకర్ కోశాధికారి పోల శశిధర్, మాజీ అధ్యక్షులు యంసాని శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, తాటి విజయ్ కుమార్, ఉప్పల శివ, దండు రామ్మోహన్,అవోపా రంగారెడ్డి జిల్లా సౌత్ శాఖ అధ్యక్షులు తాటి రామచంద్రుడు ఆవోప జిల్లా కార్యదర్శి జి బాల రాజేష్, కోశాధికారి గుడిపల్లి వెంకటరమణ, రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యులు పెండ్యాల జగదీశ్వర్ , అవోపా జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పెండ్యాల నీరజ, కార్యదర్శి తాటి సుమలత, వాసవి క్లబ్ అధ్యక్షులు కల్వ మాణిక్యం, మహిళా సంఘం అధ్యక్షురాలు శ్రీలత, ఆయా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అదృశ్యమైన చిరునవ్వులు

మొదటిపేజీ తరువాయి

మహిళలు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో వెళ్లారు? ఏమైపోతున్నారు? అన్న ప్రశ్నలు ఇంకా సమాధానం లేని రహస్యాలుగా మిగిలిపోయాయి.

వెనుక దాగున్న కారణాలేంటి?

పోలీసు విచారణలో పలు కోణాలు వెలుగులోకి వస్తున్నాయి.ఉద్యోగాల పేరిట ఇతర రాష్ట్రాలకు వెళ్లడం. ప్రేమ వ్యవహారాలు, వివాహ హామీలు. సోషల్ మీడియా ద్వారా పరిచయాలు. కుటుంబ సమస్యలతో ఇంటి నుంచి వెళ్లిపోవడం అయితే, కొన్ని కేసుల్లో మహిళలు ఇతర రాష్ట్రాలు మాత్రమే కాదు, దేశ సరిహద్దులు కూడా వారు దాటినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మానవ అక్రమ రవాణా, బలవంతపు శ్రమ, లైంగిక దోపిడీ వంటి అంశాలపై కూడా పోలీసులు దృష్టి సారించారు. కరీంనగర్ ప్రాంత గణాంకాలను ఆధారంగా తీసుకుంటే, తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 10 పోలీస్ కమిషనరేట్ల పరిధిలో సుమారు 5,670 మంది మహిళలు మిస్సింగ్ అవుతున్నారనే అంచనా వేస్తున్నారు. ఇది కేవలం అధికారిక కేసుల లెక్క మాత్రమే. ఫిర్యాదు చేయని కేసులను కలుపుకుంటే, ఈ సంఖ్య రెండింతలు ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

కుటుంబాల జీవితాలు తలకిందులే

మిస్సింగ్ అయిన మహిళల కుటుంబాల జీవితం ఒక్కసారిగా ఆగిపోతుంది. ప్రతి ఫోన్ కాల్ ఓ ఆశ. ప్రతి తెలియని సమాచారం ఓ భయం. పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల చుట్టూ తిరుగుతూ కుటుంబాలు ఆర్థికంగా, మానసికంగా కుంగిపోతున్నాయి. కొన్నిచోట్ల సమాజపు ఒత్తిళ్లు, అపవాదులు కూడా ఈ కుటుంబాల్ని వెంటాడుతున్నాయి. షీ-టీమ్స్, హెల్ప్‌లైన్లు, కఠిన చట్టాలు ఉన్నప్పటికీ, మిస్సింగ్ కేసుల సంఖ్య తగ్గకపోవడం మహిళల భద్రతపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. 'మహిళలు నిజంగా సురక్షితమేనా?' అన్న ప్రశ్నకు సమాధానం దొరకని పరిస్థితి ఏర్పడింది. ఈ కథ తెలంగాణ అంతటా ప్రతిధ్వనిస్తోంది. సంఖ్యలు మాత్రమే కాదు, ఇవన్నీ జీవితాలు, కలలు, కుటుంబాల కన్నీటి కథలు. ఈ అదృశ్యమైన చిరునవ్వులు మళ్లీ ఇంటి ముంగిట కనిపించాలంటే - ప్రభుత్వం, పోలీస్ శాఖ, సమాజం కలిసి ఇప్పుడే కదలాల్సిన సమయం వచ్చింది.

19వ తేదీ డెడ్ లైన్

మొదటిపేజీ తరువాయి

ఉన్నారు. ఈ పది మందిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పీకర్ సకాలంలో స్పందించి చర్యలు తీసుకోలేదని హైకోర్టును ఆశ్రయించారు. సదరు ఎమ్మెల్యేలపై విచారణ చేపట్టాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు హైకోర్టు సూచించింది. ఈ ఉత్తర్వులతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ నాయకులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

రెండు నెలల సమయం కావాలని

విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ యేడాది జులై 31న ఆ పది మంది ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులను మూడు నెలల్లో తేల్చాలని స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ వేగవంతం చేశారు. నిర్దేశించిన మూడు నెలల గడువులోపు విచారణ పూర్తి చేయకపోవడంపై నవంబర్‌లో సుప్రీంకోర్టు మరోసారి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కారంగా పరిగణిస్తున్నట్లు పేర్కొన్న సుప్రీంకోర్టు, త్వరగా నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. లేదంటే తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా హెచ్చరించింది. నోటీసులు అందుకుని స్పందించిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై విచారణ పూర్తి చేసేందుకు మరో రెండు నెలలు సమయం కావాలని స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంలోనే సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

అభివృద్ధి పనుల కోసమే సమావేశం

ఎనిమిది మంది ఎమ్మెల్యేలకు చెంది ఇప్పటికే క్రాస్‌ఎగ్జామినేషన్ పూర్తయింది. ఆ ఎమ్మెల్యేలపై నిర్ణయం రిజర్వ్ చేసిన స్పీకర్ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి విషయంలో రెండు సార్లు నోటీసులు ఇచ్చినా వివరణ ఇవ్వకుండా మరింత సమయం కావాలని కోరారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని తమ వాదనల్లో స్పష్టం చేశారు. ఇప్పటికీ తాము సాంకేతికంగా బీఆర్ఎస్‌లోనే ఉన్నామని వెల్లడించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో అధికారికంగా చేరలేదని స్పీకర్‌కు వివరణ ఇచ్చారు. తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల కోసమే ముఖ్యమంత్రితో సమావేశమైనట్లు తెలిపారు.

19వ తేదీలోగా నిర్ణయం ప్రకటించాలి

పశ్చిమ బెంగాల్ హైకోర్టు పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడడంతో ఇక్కడ తెలంగాణ ఎమ్మెల్యేల విషయంలోనూ అదే జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇద్దరు కూడా పార్టీ మారినట్లు పూర్తి ఆధారాలు బీఆర్ఎస్ నాయకులు స్పీకర్‌కు నివేదించడంతో వీరిపై అనర్హత వేటు పడే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, తమ నాయకుడిపై వేటు పడితే ఉప ఎన్నికలలో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు ఆ ఇద్దరు ఎమ్మెల్యేల సన్నిహితులు చెబుతున్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు కూడా ఈ నెల 19వ తేదీకి ముగియనుండడంతో ఆ లోగా స్పీకర్ తన నిర్ణయాన్ని ప్రకటించాల్సి ఉంది. సుప్రీంకోర్టు నిశితంగా పరిశీలిస్తున్న ఈ వ్యవహారంలో స్పీకర్ నిర్ణయమే కీలకం.

నేడే మలిదశ పంచాయతీ

మొదటిపేజీ తరువాయి

పంపించారు. ఇదిలా ఉంటే, తొలిదశ పోరులో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు మెజార్టీ స్థాయిలో గెలిచారు. ఆ తర్వాత స్థానంలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థులు గెలిచారు. రెండో విడత ఎన్నికల సందర్భంగా గ్రామాలలో ఉన్న అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా చేసుకొని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇంటింటికి తిరిగి నగదు, మద్యం, మాంసాహారం ఇస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. డబ్బు అయితే ఫోన్ పే లాంటి మాధ్యమాల ద్వారా నగదు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు కుల సంఘాల వారీగా తాయిలాలు, హామీలు ఇస్తు మచ్చిక చేసుకుంటూ అభ్యర్థులు రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్నట్లుగా సమాచారం. సమస్యాత్మక ప్రాంతాల్లో ఇప్పటికే పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఈటల X సంజయ్

మొదటిపేజీ తరువాయి

తీవ్ర స్థాయికి చేరాయి. బండి సంజయ్‌పీఆర్వో ఈటల రాజేందర్‌పై సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులతో విభేదాలు బహిర్గతమయ్యాయి. శనివారం కమలాపూర్ మండలంలో ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా పోస్టులపై ఈటల స్పందించారు. తనపై ఎవరు ఏం చేస్తున్నారు.. ఎవరేం చెబుతున్నారో ప్రజలకు అర్థమవుతోందని అన్నారు. సందర్భం వచ్చినప్పుడు అన్ని విషయాలు చెబుతానని చెప్పుకొచ్చారు. పంచాయతీ ఎన్నికలు పూర్తి అయ్యాక ఇటీవల జరిగిన పరిణామాలన్నీ చెబుతానని పేర్కొన్నారు. తాను ఏ పార్టీలో ఉండాలో ప్రజలు తేల్చుకుంటారని చెప్పుకొచ్చారు. ఈ అంశాలను బీజేపీ హై కమాండ్ తేలుస్తుందని వ్యాఖ్యానించారు. ఇక కాంగ్రెస్‌పై ఎంత వ్యతిరేకత ఉందో ఈ ఫలితాలను బట్టి అర్థం చేసుకోవాలని చెప్పుకొచ్చారు. సింగరేణిలో క్వార్టర్స్ బాగుచేయడానికి పైసలు లేవా అని ప్రశ్నించారు. సింగరేణి డబ్బులతో తన ఫుట్ బాల్ ట్రైనింగ్ కోసం సీఎం రేవంత్‌రెడ్డి వందల కోట్లు ఖర్చు ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు కోట్ల రూపాయలు దోపిడి చేశారని కవిత ఆరోపిస్తున్నారని ఈటల రాజేందర్ అన్నారు.

కాంగ్రెస్ సర్కార్ పేదల ఇళ్లను కూలుస్తుందా..?

ఆరోపణలు వస్తున్న బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కార్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఈటల నిలదీశారు. జీతాలు ఇవ్వడానికి కూడా డబ్బులు లేవని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వల్లకాడులా మారే పరిస్థితి ఉందని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం పేదల ఇళ్లను కూలుస్తుందా?.. పెద్దల ఆస్తులను కాపాడుతుందా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గ్రామాల అభివృద్ధిలో తన వంతు సహకారం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. తన స్వగ్రామం కమలాపూర్‌లో తనను తొక్కేయాలని చూశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకతతో మొదటి విడతలో 50 శాతం సీట్లు కూడా రాలేదని ఈటల అన్నారు.

ఏఐ సహకారంతో బీజేపీని ఓడిస్తాం

మొదటిపేజీ తరువాయి

ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. వీటిపై సమ్మిట్ లో నిపుణులు అనేక సలహాలు, సూచనలు ఇచ్చారని వివరించారు. ముఖ్యంగా ఏఐ టెక్నాలజీని నేరాలను కట్టడి చేయడానికి ఉపయోగించాలని చెప్పారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో దేశంలోనే అత్యధిక సైబర్ నేరాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ సహకారంతో సృష్టించిన ఫేక్ వీడియోలు కూడా సామాజిక మాధ్యమాల్లో చెలామణి చేస్తున్నారని అన్నారు. వీటన్నింటినీ ఏఐ టెక్నాలజీని వినియోగించుకొని అరికట్టాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ... ఉత్తర ప్రదేశ్ లో దాదాపు 25 కోట్ల జనాభా ఉందని ప్రభుత్వం చెబుతోందని, ఎస్ఐఆర్ ద్వారా బీజేపీ ప్రభుత్వం సుమారు 3 కోట్ల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తుందని తెలిపారు. ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గెలవడానికే బీజేపీ ఎస్ఐఆర్ చేపడుతోందని ఆరోపించారు. ఇది ఎస్ఐఆర్ కాదని, ఎన్ఆర్సీ ప్రక్రియ అని విమర్శించారు. ఎన్ఆర్సీకి ఎన్ని పత్రాలు అడుగుతారో ఎస్ఐఆర్ కి అన్ని పత్రాలు అడుగుతున్నారని అన్నారు. ఓటు హక్కు కల్పించడం ఎన్నికల సంఘం బాధ్యత కానీ ఓట్లు తొలగించడం కాదని స్పష్టం చేశారు. కాగా, తాము ఇండియా కూటమిలోనే కొనసాగుతమని పునరుద్ఘాటించారు.

ప్రయాణీలకు దక్షిణ మధ్య రైల్వే గుడ్‌న్యూస్

- నేటి నుంచి సంక్రాంతి ప్రత్యేక రైళ్ల అడ్వాన్ బుకింగ్
- దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ వెల్లడి




ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే గుడ్‌న్యూస్ తెలిపింది. పండగ రద్దీ దృష్ట్యా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి అడ్వాన్స్ బుకింగ్ ఓపెన్ చేయనున్నట్లుగా తెలిపింది. మరోవైపు జన్మభూమి సూపర్‌ఫాస్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల ప్రయాణ వేళల్ని మార్చింది. పలు స్టేషన్ల మధ్య ఇప్పటికే నడుస్తున్న వీక్లీ ట్రైన్లను సంక్రాంతి రద్దీ నేపథ్యంలో మరికొన్ని వారాల పాటు పొడిగిస్తున్నట్లుగా దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. సికింద్రాబాద్-అనకాపల్లి (07041) రైలు జనవరి 4, 11, 18వ తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. అనకాపల్లి-సికింద్రాబాద్(07042) రైలు జనవరి 5, 12, 19న, హైదరాబాద్-గోరఖ్‌పూర్(07075) రైలు జనవరి 9, 16, 23వ తేదీల్లో, గోరఖ్‌పూర్-హైదరాబాద్(07076) రైలు జనవరి 11 18, 25న బయల్దేరుతుందని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

అందుబాటులోకి స్లీపింగ్ పాడ్స్..

ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే అత్యాధునిక స్లీపింగ్ పాడ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. చర్లపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో ప్రయాణికులు ఈ సేవలను వినియోగించుకుంటున్నారు. విమానాశ్రయాల తరహాలో ఈసౌకర్యాలు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. అయితే ఈ సేవలను ఉపయోగించుకునేందుకు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ప్రయాణికుల లగేజీ భద్రపరిచేందుకు లాకర్, మొబైల్ ఛార్జింగ్, ఫ్రీ వైఫై, టాయ్‌లెట్లు తదితర సౌకర్యాలు ఉంటాయని అన్నారు. ప్రస్తుతం చర్లపల్లి, కాచిగూడ రైల్వే స్టేషన్లలో ఈ సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన వివరించారు.

జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వేళల మార్పు

విశాఖపట్నం-లింగంపల్లి మధ్య నడిచే జన్మభూమి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12805/12806) రైళ్ల ప్రయాణ వేళల్ని దక్షిణమధ్య రైల్వే మార్చింది. కొత్త వేళలు ఫిబ్రవరి 15వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని జోన్ సీపీఆర్వో ఏ.శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విశాఖలింగంపల్లి (12806) రైలు విశాఖపట్నంలో ఉదయం 6.20కి బయల్దేరి, లింగంపల్లికి రాత్రి 7.15కి చేరుకుంటుందని ఆయన వివరించారు. లింగంపల్లి-విశాఖపట్నం(12805) ట్రైన్ ఉదయం 6.55కి లింగంపల్లి నుంచి బయల్దేరి, విశాఖపట్నంకు రాత్రి 7.50కి చేరుకుంటుందని శ్రీధర్ తెలిపారు.



నక్సలిజం ఎవరికీ ప్రయోజనం కలిగించదు. శాంతి మాత్రమే అభివృద్ధికి మార్గం చూపగలదు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజాన్ని అంతం చేస్తాం. నక్సలిజం విషపూరితమైన పాము లాంటిది. దాన్ని అంతం చేసిన తర్వాత అభివృద్ధిలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుంది.

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

తెలుగు ప్రజలను కలవడం సంతోషం

- ఇక్కడి ప్రజల అభిమానం శక్తినిచ్చింది
- ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ
- అలరించిన ఫుట్బాల్‌మ్యాచ్
- గోల్ సాధించిన సీఎం రేవంత్
- మ్యాచ్ తిలకించిన రాహుల్‌గాంధీ



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13: హైదరాబాద్ వచ్చి తెలుగు ప్రజలను కలవడం సంతోషంగా ఉందని ప్రపంచ ఫుట్ బాల్ దిగ్గజం, అర్జెంటినా కెప్టెన్ లియోనెల్ మెస్సీ అన్నారు. ఇక్కడి ప్రజలు చూపించిన అభిమానం తనకు ఎంతో శక్తినిచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం మైదానంలో క్రీడాభిమానులను ఉర్రూతలూగించింది. ఫుట్ బాల్ దిగ్గజాలు రోడ్రిగో డి పాల్ (అర్జెంటీనా), లూయిస్ సువారెజ్ (ఉరుగ్వే) లతో కలిసి హైదరాబాద్ చేరుకున్న మెస్సీ స్టేడియంలో అడుగు పెట్టినప్పటి నుంచి చివరి వరకు గ్యాలరీలో ఉన్న క్రీడాభిమానులకు అభివాదం చేస్తూ వారిలో జోష్ నింపారు. ప్రారంభంలో సింగరేణి ఆర్‌ఆర్ 9 టీమ్‌కు, అపర్ణ ఆల్ స్టార్స్ టీమ్‌కు మధ్యన సాగిన ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను మెస్సీ ఆసక్తిగా తిలకించారు. ఆర్‌ఆర్ టీమ్ తరపున మధ్యలో చేరిన రేవంత్ రెడ్డి నాలుగో గోల్ సాధించినప్పుడు అభిమానులు పెద్ద ఎత్తున కేరింతలు కొట్టారు. రాహుల్ గాంధీ మ్యాచ్ ను గ్యాలరీ నుంచి తిలకించారు. మెస్సీ స్టేడియంలోకి అడుగు పెట్టడం నుంచి ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఎగ్జిబిషన్ ఫుట్ బాల్ మ్యాచ్‌లో సింగరేణి ఆర్‌ఆర్ 9 టీమ్ తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోల్ సాధించి హైలైట్‌గా నిలిచారు. రేవంత్ రెడ్డి గోల్ చేసిన అనంతరం మెస్సీ మైదానంలోకి వచ్చారు. మెస్సీకి స్వాగతంగా క్రీడాభిమానుల హర్షధ్వానాలతో స్టేడియం దద్దరిల్లింది. మెస్సీతో పాటు రొడ్రిగో, సువారెజ్‌లు సైతం అభిమానులను అలరించారు. ఉప్పల్ మైదానంలో శనివారం జరిగిన ఫ్రెండ్లీ ఫుట్బాల్ మ్యాచ్లో మెస్సి జట్టుపై 30 గోల్స్తో సింగరేణి ఆర్‌ఆర్ జట్టు విజయం సాధించింది. విన్నర్, రన్నరప్ జట్లకు మెస్సి, సీఎం రేవంత్రెడ్డి, రాహుల్గాంధీ ట్రోఫీలు అందించారు.

రాహుల్ కు స్వాగతం పలికిన మంత్రులు




ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13: హైదరాబాద్ విచ్చేసిన కాంగ్రెస్ అగ్రనేత, లోకసభలో ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో ముఖ్యమంత్రి రేవంత్, మంత్రులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పలువురు నాయకులు ఉన్నారు.

తెలంగాణ అభివృద్ధి, ప్రజాస్వామ్య దృక్పథం

- తెలంగాణ అభివృద్ధి ప్రయాణం
- జర్మన్ బుండెస్టాగ్‌ను ఆకట్టుకున్న సంభాషణ
- బీఆర్ఎస్ ఎంఎల్‌సీ డా. శ్రవణ్ దాసోజు
- జర్మని పార్లమెంట్ సభ్యులతో సమావేశం



ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 13: జర్మన్ బుండెస్టాగ్ అంతర్గత వ్యవహారాల కమిటీ చైర్మన్ జోసెఫ్ ఓస్టర్ నేతృత్వంలో, జర్మని వివిధ రాజకీయ పక్షాలకు చెందిన పార్లమెంట్ సభ్యులతో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో తెలంగాణ ప్రజాస్వామ్య పురోగతి, పాలన పట్ల దృక్పథం, అభివృద్ధి దారి అంతర్జాతీయంగా విశేష ఆసక్తిని రేకెత్తించిందని బీఆర్ఎస్ ఎంఎల్‌సీ డా. శ్రవణ్ దాసోజు తెలిపారు. ఈ సంభాషణలో కేసీఆర్ నాయకత్వంలో సాగిన చారిత్రాత్మక తెలంగాణ ఉద్యమాన్ని లోతుగా పరిశీలించారని దాసోజు పేర్కొన్నారు. ఈ ఉద్యమం ఆత్మగౌరవం, సమగ్ర పాలన, సమతుల్య ఫెడరలిజం కోసం ప్రజల ఆకాంక్షలను వ్యక్తం చేసిన కీలక ప్రజాస్వామ్య ఉద్యమంగా అంతర్జాతీయ శాసనసభ్యులు గుర్తించారని ఆయన తెలిపారు. ప్రజల సంఘటిత ప్రజాస్వామ్య పోరాటం రాష్ట్ర అవతరణ తర్వాత సంస్థాగత సంస్కరణలుగా, ఆర్థిక పురోగతిగా ఎలా మారిందన్న అంశాన్ని వారు విశేషంగా మెచ్చుకున్నారని చెప్పారు. హైదరాబాద్ నగరంలోని సమ్మిళిత సంస్కృతి, ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థ, ప్రపంచంతో ఉన్న అనుసంధానం కూడా ఈ చర్చల్లో ప్రాధాన్యంగా ప్రస్తావించబడ్డాయని డా. దాసోజు చెప్పారు. అలాగే భారత్-జర్మనీ మధ్య విస్తరిస్తున్న సహకార అవకాశాలపై కూడా చర్చ జరిగిందని తెలిపారు. ఇలాంటి పరస్పర సంభాషణలు సాధారణ దౌత్య సంబంధాలకు మించి ప్రజాస్వామ్య భాగస్వామ్యాన్ని మరింత బలపరుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. తన ముగింపు వ్యాఖ్యల్లో, ప్రపంచం వేగంగా విభజన దిశగా సాగుతున్న ఈ సమయంలో ప్రజాస్వామ్య సూత్రాలపై ఆధారపడి సాగించే నిరంతర పార్లమెంటరీ సంభాషణలు అత్యంత అవసరమని డా. దాసోజు పేర్కొన్నారు. ప్రపంచ ప్రజాస్వామ్య సంభాషణలో సార్థకంగా పాల్గొనడానికి, నేర్చుకోవడానికి, తన వంతు సహకారం అందించడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు.



మెస్సీ మ్యాచ్ తిలకించిన రాహుల్ గాంధీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13: ఉప్పల్ వేదికగా మెస్సీతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం జరిగింది. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మెస్సీ మధ్య ఫుడ్‌బాల్ మ్యాచ్ కూడా జరిగింది. అయితే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆహ్వానంతో ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చారు. ఢిల్లీ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్ గాంధీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు మంత్రులు, నేతలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి వెళ్లారు. అనంతరం అక్కడి నుంచి ఉప్పల్‌కు చేరుకున్నారు. అక్కడ సీఎం రేవంత్ రెడ్డి, మెస్సీ మధ్య జరిగే ఫుడ్‌బాల్ మ్యాచ్‌ను రాహుల్ గాంధీ వీక్షించారు. అనంతరం తిరిగి ఢిల్లీ తిరిగి వెళ్లారు.

గ్లోబల్‌సమ్మిట్లో రైతులు, విద్యార్థుల సందడి



ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబరు 13: గ్లోబల్‌సమ్మిట్ చివరి రోజు శనివారం రైతులు, విద్యార్థులతో పాటు సందర్శకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం రైతుల ఆదాయాన్ని పెంచడానికి అరుదైన వ్యూహంపై, మధ్యాహ్నం వ్యవసాయం, గ్రామీణ పరివర్తన గ్రామీణ తెలంగాణను పట్టణ అవకాశాలతో అనుసంధానించే అరుదైన, నివారణ విధానాలపై రైతులకు, విద్యార్థులకు రెండు పర్యాయాలు సెమినార్ నిర్వహించి క్లుప్తంగా వివరించారు. నాగర్ కర్నూలు జిల్లా నుండి వచ్చిన ఆదర్శ మహిళా రైతు లావణ్య సేంద్రీయ వ్యవసాయం ద్వారా కలిగే స్వీయ ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రజా సమస్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 13: పేదప్రజలు, మహిళలు, విద్యార్థులు, ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న కష్టాలు, క్రైమ్, డ్రగ్స్, రోడ్లు, డ్రైనేజ్ సమస్యలపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జాగృతి జనంబాటలో భాగంగా హైదరాబాద్ జిల్లాలో నాలుగో రోజు పర్యటించారు. ఈ సందర్భంగా శనివారం ఆమె కార్వాన్ నియోజకవర్గం పరిధిలోని బాపూ ఘాట్ ను సందర్శించి మహాత్మా గాంధీ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. బాపూ ఘాట్ నుండి లంగర్ హౌస్ దర్గాకు ఆటోలో బయలుదేరిన కవిత, దర్గాను సందర్శించి చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా కవిత తన పర్యటనలో మాట్లాడుతూ, బాపూ ఘాట్ ఇసా, మూసీ నది త్రివేణి సంగమం వద్ద ఉందని, అయితే బాపూ ఘాట్ డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా మారింది అని పేర్కొన్నారు. ఈ సమస్యపై పోలీసులు, ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాగా, గతంలో కేసీఆర్ 150 అడుగుల గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తానని, రేవంత్ రెడ్డి కూడా ఏర్పాటు చేస్తారంటూ మాటలు చెప్పినా వారు దాన్ని చేయలేదని గుర్తుచేశారు. కవిత ప్రభుత్వానికీ బాపూ ఘాట్ అభివృద్ధి కోసం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. లంగర్ హౌస్ దర్గా వద్ద ఆమె మాట్లాడుతూ, ఆటో డ్రైవర్ల కష్టాలు, ఫ్రీ బస్‌లు వచ్చిన తర్వాత ఆటోలకు ఏర్పడిన ఇబ్బందులు వంటి సమస్యలను ప్రభుత్వ దృష్టిలోకి తీసుకురావాలని చెప్పారు. అలాగే హైదరాబాద్‌లో మహిళలు బయటకు రావడానికి భయపడే పరిస్థితి ఏర్పడిందని, క్రైమ్, డ్రగ్స్ సమస్యలు అధికమైందని, ఈ సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వం ఉన్నప్పటికీ లేనట్లేనని గమనించారు. బహదూర్ పుర నియోజకవర్గంలోని ఎన్ఎం గూడలో పేద ప్రజల సమస్యలను తెలుసుకున్న కవిత సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బీసీ హాస్టల్ ను సందర్శించి విద్యార్థుల సమస్యలను తెలుసుకున్న కవిత ప్రభుత్వానికే ఈ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.




విజన్ 2047 కాదు..
విద్యార్థుల పాలిట పాయిజన్ 2047


- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్
- బాగ్ లింగంపల్లి గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం
- ఆసుపత్రిలో 90 మంది విద్యార్థులు
- పరామర్శించిన మాజీ మంత్రి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 13: విజన్ 2047 కాదు, విద్యార్థుల పాలిట పాయిజన్ 2047 అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు మండిపడ్డారు. బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న 90 మంది విద్యార్థులు కింగ్ కోఠి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రికి చేరిన విద్యార్థులను ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశం, ముఠా గోపాల్ లతో కలసి మాజీ మంత్రి హరీష్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న వైద్యం వివరాలను డాక్టర్లు హరీష్ రావు ముందు వివరించారు. హరీష్ రావు మాట్లాడుతూ, రాష్ట్రంలోని గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజూ విద్యార్థులు కలుషిత ఆహారం కారణంగా ఆసుపత్రిలో చేరుతున్నారని తెలిపారు. మాదాపూర్ లోని చందు నాయక్ తండాలో 43 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తర్వాత ఆసుపత్రిలో చేరి ఘటనను ఉదాహరణగా ప్రస్తావించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వ "విజన్ 2047" ప్రతిపాదన పై తీవ్ర విమర్శలు చేశారు. ఫుట్ బాల్ కోసం పెద్ద ఖర్చులు పెట్టడం, స్టేడియాలను నిర్మించడం జరుగుతున్నప్పటికీ, ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం మరలవలసిందని తెలిపారు. విద్యార్థులు భయాందోళనలో ఉన్నారని, ఆసుపత్రి నుంచి మళ్లీ హాస్టల్‌కు వెళ్లే విషయంలో భయపడుతున్నారని హరీష్ రావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పలు పర్యటనలు, ఫుట్ బాల్ మ్యాచ్‌లకు సమయాన్ని కేటాయిస్తున్నప్పటికీ, ఆసుపత్రి పాలయిన విద్యార్థులను పరామర్శించడంలో విఫలమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హరీష్ రావు రాహుల్ గాంధీపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలో రైతులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాహుల్ గాంధీ సరైన చర్యలు తీసుకోలేదని, ప్రత్యేక విమానంలో హైదరాబాద్కు వచ్చి రేవంత్ రెడ్డి ఆడే ఫుట్ బాల్ చూడడం మాత్రమే చేసినందుకు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు సమాచార శాఖ రిటైర్డ్ ఉద్యోగుల సమ్మేళనం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైఅదరాబాద్, డిసెంబర్ 13 : సమాచార, పౌర సంబంధాల శాఖ విశ్రాంత ఉద్యోగుల (తెలంగాణ, ఏపీ) వార్షిక ఆత్మీయ సమ్మేళనాన్ని నేడు నిర్వహిస్తున్నట్టు శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం తెలిపింది. ఖైరతాబాద్ లోని రంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపు హాలు నందు ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమ్మేళనానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, సమాచార శాఖ పూర్వ కమిషనర్ జీవీన్. ఫణికుమార్, ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో లీగల్ అంశాలపై ప్రసంగం, యోగా, ఆరోగ్య విషయాలపై ప్రత్యేక క్లాసులు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని సన్మానించనున్నట్టు నిర్వాహకులు వెల్లడించారు.





ఎద్దు నాగేష్ పై మరోసారి బాధితుడి ఫిర్యాదు

- ఇంటి తాళం పగలకొట్టి ఇల్లు కబ్జా చేసే యత్నం
- శామీర్పేట్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు

ప్రతిపక్షం ప్రతినిధి, మేడ్చల్, డిసెంబర్ 13 : మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ ఆగడాలు రోజు రోజుకు పెచ్చరిల్లి పోతున్నాయి. మేడ్చల్ జిల్లా శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని తూంకుంటలో వెంకట్ రెడ్డి అనే వ్యక్తి తన ఇంటిని సునీత అనే మహిళకు అద్దెకు ఇచ్చాడు. ఆ మహిళ తన తండ్రి ఆరోగ్యం బాగోలేక, బోధన్ జిల్లా, కాజీపూర్ గ్రామానికి వెళ్లి రెండు నెలలు అక్కడే ఉండిపోయింది.. దీంతో కాంగ్రెస్ పార్టీ నేత తూముకుంట మాజీ సర్పంచ్ అయిన ఎద్దు నాగేష్ ఆ ఇల్లు కబ్జా చేసేందుకు.. కుయుక్తులు పన్నాడు.. ఆ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న సామానులు బయటకు తీసుకు వెళ్ళి పడేసి.. మరో మహిళను తీసుకొచ్చి అందులో ఉంచాడు. విషయం తెలుసుకున్న బాధితురాలు సునీత ఇంటి యజమానైన వెంకటరెడ్డికి విషయం తెలుపగా వెంకట్ రెడ్డి షామీర్ పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు కలరింగ్ ఇస్తూ ఫిర్యాదు చేసిన బాధితుడైన ఇంటి యజమాని వెంకటరెడ్డిని భయభ్రాంతులకు గురిచేసిన ఎద్దు నాగేష్ పోలీసులను మోసం చేసి కేసు నమోదు చేయించినట్టు తనకు అనుకూలంగా వీడియో రికార్డు చేయించిన మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్ ఆ వీడియోను రిలీజ్ చేయించాడు. అయితే సదరు ఎద్దు నాగేష్ తో తనకు ప్రాణహాని ఉందని.. ఆ సమయంలో తనను బెదిరించి తనతో బలవంతంగా వీడియో రికార్డ్ చేయించాడని, ఆ సమయంలో తాను చెప్పింది చేయక తప్పలేదు అంటూ పోలీసులకు జరిగిన విషయం చెప్పి ఎద్దు నాగేష్ వళ్ళ ప్రాణహాని ఉందంటూ మరో సారి ఫిర్యాదు చేశాడు బాధితుడు.. ఇంటి యజమాని వెంకట్ రెడ్డి.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రబీకి సరిపడా యూరియా నిల్వలపై ప్రభుత్వ దృష్టి

- యూరియా తరలించేందుకు కేంద్ర రైల్వే, పోర్టుల మంత్రులకు లేఖలు
- పోర్టుల వద్ద యూరియా హ్యాండ్లింగ్‌కు అత్యవసర ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రానికి మంత్రి తుమ్మల వినతి



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్13: రబీ సాగు సీజన్‌లో తెలంగాణ రాష్ట్రంలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో యూరియా వినియోగం అత్యధికంగా ఉండే అవకాశం ఉన్నందున, ఆ సమయంలో రైతులకు సరిపడా ఎరువుల సరఫరా చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని, డిమాండ్‌ను తట్టుకునేలా బఫర్ నిల్వలను అందుబాటులో ఉంచడానికి, కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఎరువులలో అక్టోబర్ నుండి డిసెంబర్ నెల వరకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున యూరియాను అందించాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్టు మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.48 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని, ఈ నిల్వలును డిసెంబర్ ఆఖరికి ఇంకా యెక్కువ మొత్తం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎరువుల శాఖ ద్వారా డిసెంబర్ నెలకు తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన యూరియాలో 86000 మెట్రిక్ టన్నుల ఇప్పటికే కాకినాడ, కృష్ణపట్నం, విశాఖపట్నం, తుత్తుకుడి, గంగవరం, కారైకాల్, జైగఢ్ వంటి వివిధ పోర్టులకు చేరిందని మంత్రి గారు వెల్లడించారు. ఈ నిల్వలను త్వరితగతిన రాష్ట్రానికి తరలించడం అత్యవసరం కాబట్టి, యూరియా రవాణా ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, అలాగే కేంద్ర పోర్టులు, షిప్పింగ్ & వాటర్‌వేస్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాలు ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖల ద్వారా అభ్యర్థించారు. యూరియా రవాణాకు అవసరమైన ఖాళీ రైల్వే రేకులను తక్షణమే కేటాయించడం, పోర్టుల వద్ద క్లియరెన్స్ మరియు హ్యాండ్లింగ్ ప్రక్రియలను వేగవంతం చేయడం, యూరియా రవాణాకు ఇతర సరుకుల కంటే మొదటి ప్రాధాన్యం ఇవ్వడం, అలాగే పోర్టు అధికారులు, షిప్పింగ్ లైన్లు, హ్యాండ్లింగ్ ఏజెన్సీలు, రైల్వే అధికారుల మధ్య సమన్వయం పెంచి రవాణాలో ఆలస్యాలను నివారించడం వంటి అంశాలను లేఖల ద్వారా కేంద్ర మంత్రులను కోరినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ రవాణా ప్రక్రియను పర్యవేక్షించేందుకు, రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులను కూడా పోర్టులకు పంపి, సంబంధిత అధికారులతో సంప్రదించాలని ఆదేశించినట్టు మంత్రి తెలిపారు.



భూ సమస్యలు తీరక సామాన్యులు బాధపడుతున్నారు. 5 సెంటీమీటర్ల తేడా కూడా లేకుండా కొలతలు చేయగల టెక్నాలజీతో భూ సర్వే జరుపుతుంటే, సర్టిఫికెట్‌పై జగన్ బొమ్మున్నందని, భూములు ఆయన తీసుకుంటారని చంద్రబాబు మాయ మాటలు చెప్పారు. ఇన్నేళ్ల అనుభవం ఉన్న చంద్రబాబు ఒక్క భూ సంస్కరణ అయినా తెచ్చారా? నేడు ఎమ్మార్వో కార్యాలయాలన్నీ ఎమ్మెల్యేల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

- ఏపీ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

సాయుధ పోరాటం విఫలమా? సఫలమా?!

సీదీ బాత్



ఎస్. కె. జకీర్
90526 31212

ఇంతటితో భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ముగుస్తుందా? ఆ ప్రమాదం లేకపోలేదు. ప్రపంచంలో చాలా దేశాలలో ఎర్ర జెండా కింద పడిపోయింది. కాకపోతే, ఇది ప్రపంచ వ్యాప్తంగా తిరిగి పైకి లేస్తున్న కాలం. ఈ కాలంలో సంక్షోభం వచ్చింది. ఇప్పుడున్న సమస్య ఎర్ర జెండాను కాపాడుకోవడం ఎట్లా అనేది' అని పాణిని ఆర్ఎస్ యూ ప్రధానకార్యదర్శిగా 1980 లలో పనిచేసిన అనాటమీ ప్రొఫెసర్,డాక్టర్ కానూరి విజయకుమార్ కౌంటర్ చేశారు. 'ఇక మావోయిస్టు పార్టీ క్యాడర్ ప్రభుత్వానికి లొంగిపోవడమో లేదా భద్రతా బలగాల చేతిలో మరణించడమో తప్ప మరో మార్గం కనిపించడం లేదు. ఆ పార్టీ, పార్టీ నడిపిన మహత్తర విప్లవ పోరాటాలు ఇక చరిత్రగానే మిగిలిపోవచ్చు' అని ప్రముఖ జర్నలిస్టు,రచయిత రాహుల్ పండిత ఒక ఛానల్ లో మాట్లాడుతూ అన్నారు.

'నగరమే పులి అయినపుడు ప్రజలు అడవిలో తల దాచుకొనక తప్పదు!' అని సుప్రసిద్ధ విప్లవ రచయిత, కవి వరవరరావు దాదాపు నాలుగు దశాబ్దాల కిందట రాశారు. ఆ వాక్యం గోడలమీదకూ ఎక్కింది. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుంది' నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి'' దిక్కు మొక్కు లేని జనం ఒక్కొక్కరు అగ్నికణం','పోరాడితే పోయేదేమీ లేదు బానిసత్వం తప్ప''మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి' తదితర రాతలలో వి.వి.రాసిన ఆ వాక్యమూ ఒకటయింది. ఆ నినాదాలు రాస్తున్నప్పుడూ,వాటిని గోడలపై చదువుతున్నప్పుడూ రాడికల్ విద్యార్థులుగా ఉన్న మాలాంటి వాండ్ల శరీరంలో విద్యుత్తు ప్రవహించేది.నగరమే పులి అయినపుడు ప్రజలు అడవిలో తల దాచుకొనక తప్పదు అని రాసే సమయానికి పట్టణాలు,నగరాల్లో నిర్బంధం అప్పుడప్పుడే తీవ్రమవుతున్న దశ.ఇప్పుడు మావోయిస్టులే కాదు,వారి సానుభూతిపరులు,మద్దతుదారులు,మావోయిస్టు రాజకీయాలతో ఏకాభిప్రాయం ఉన్న వాళ్ళకు అడవిలో రక్షణ లేదు.నగరంలోనూ ఉండలేరు. పలు ఎన్ కౌంటర్లలో మరణించిన వారు అడవి ఖాళీ చేసి బయటకు వెళ్లిపోతున్న మావోయిస్టుల దృశ్యాలే ప్రతిరోజూ దర్శనమిస్తున్నవి.

వర్గశత్రు నిర్మూలన' కార్యక్రమాలతో

మొదట్లో పీపుల్స్ వార్ లేదు. కే.ఎస్,ఎస్.ఎం గ్రూపుగా పిలిచేవాండ్లం. కొండపల్లి సీతారామయ్య, సత్యమూర్తి గ్రూపు అని అర్థం. సీపీఐ (ఎం.ఎల్) పార్టీకి చెందిన అనేక గ్రూపుల్లో ఈ గ్రూపు మాత్రమే శక్తివంతంగా మారడం వెనుక ప్రజలు నిలబడడమే.మార్క్సిస్టు లెనినిస్టు పార్టీ వ్యవస్థాపకుడు చారుమజుందార్ 'ఖతం' లేదా,'వర్గశత్రు నిర్మూలన' కార్యక్రమాలతో విప్లవం రాదని కే.ఎస్ తదితర విభేదించారు.కే.ఎస్,ఎస్.ఎంలు ప్రజాసంఘాల నిర్మాణానికి పూనుకోవడం భారత విప్లవోద్యమంలో కీలక మలుపు.

నక్సల్బరీ ఉద్యమం బిహార్,ఆంధ్రప్రదేశ్,పంజాబ్, కేరళ వంటి భారతదేశంలోని ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. చారు మజుందార్ ప్రేరణతో, చిన్న గెరిల్లా దళాలు 'వర్గ నిర్మూలన 'లో భాగంగా వందలాది మంది భూస్వాములను, వారి అనుచరులను,పోలీసులను చంపాయి. 'హంతకులు జీవించడానికి అనుమతించడం మాకు మరణం లాంటిది' అని చారు మజుందార్ ప్రకటించారు. 1967-72 సంవత్సరాల మధ్య పార్టీకి మౌత్ పీస్ అయిన లిబరేషన్ పత్రిక నిండా భూస్వాముల హత్యలు, భూ ఆక్రమణలు, ఇతర ఆస్తులను రైతు గెరిల్లాలు ఎలా 'జప్తు చేసుకున్నారో' వార్తలతో ఉండేది. ఆచరణలో, 'వర్గ శత్రు నిర్మూలన' ప్రతికూల ఫలితాలను ఇచ్చింది. కలకత్తా వీధుల్లో,ఉన్నత కళాశాలల నుంచి నక్సలైట్ పార్టీ మదద్దతుదారులు నాటు బాంబులతో తిరుగుతూ పోలీసులపై దాడి చేసైనా ఘటనలూ అప్పట్లో జరిగాయి.ఆ పంథా సరయినది కాదని బలంగా నమ్మి 'ప్రజాయుద్ధ పంథా'కు రూపకల్పన చేసిన నక్సలైట్ నాయకునిగా కొండపల్లి సీతారామయ్యకు చరిత్రలో ప్రత్యేక స్థానం లభించింది.

బలహీనపడిన ఉద్యమం

'బీజేపీని విమర్శించినందుకు జర్నలిస్టులను, న్యాయవాదులను, రచయితలను,ప్రొఫెసర్లను అర్బన్ నక్సల్ అని ముద్రవేసి యేళ్ల తరబడి జైలులో నిర్బంధించిన ప్రభుత్వం, తమను ప్రజల మధ్య పని చెయ్యడానికి అనుమతిస్తుందని ఇప్పుడు ఆయుధాలు వదిలిపెడుతున్న నక్సల్ నాయకులు ఆశలు పెట్టుకోవడం అసమంజసం. సహజవనరుల లూటీనీ, నిరుపేదల దోపిడీనీ సవాలు చేసిన అంత శక్తిమంతమైన ఉద్యమమే ఓడిపోతే, ఇక వాస్తవంగా గెలిచేదెవరు? నక్సల్ ఉద్యమ ఓటమిని ఎవరి గెలుపుగా భావించాలని' గాంధేయవాది హిమాంశు కుమార్ అన్నారు. మావోయిస్టు పార్టీ సెక్రెటరీ బస్వరాజు,ఆ పార్టీ కీలక యోధుడు హిడ్మా ఎన్ కౌంటర్ల తర్వాత పార్టీ క్యాడర్ పూర్తిగా బలహీనపడింది. మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్, మరో సభ్యుడు తక్కెళ్లపల్లి వాసుదేవరావు దాదాపు మూడు వందల మందికి పైగా మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోవడంతో పార్టీ మరింత బలహీనపడినట్టు విశ్లేషణలు వస్తున్నవి. తాజాగా మాహారాష్ట్ర,మధ్యప్రదేశ్,ఛత్తీస్ గఢ్ కమిటీ నాయకుడు అనంత్ సహా మరికొందరు లొంగిపోయారు. పుల్లూరి ప్రసాదరావు, బండి ప్రకాశ్ వంటి నాయకులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. 2000ల నుంచి మావోయిస్టులు ప్రభుత్వ దళాలపై దాడులు చేయడం,పోలీసుల క్యాంపులపై దాడి చేసి ఆయుధాలను దోచుకోవడం వంటి ఘటనలు ముమ్మరమయ్యాయి.మావోయిస్టు కార్యకలాపాలు తూర్పున నేపాల్ సరిహద్దు నుండి దక్షిణాన దక్కన్ పీఠభూమి వరకు ఒక విశాలమైన భూమిలో నడిచాయి.ఈ ప్రాంతాన్ని మావోయిస్టులు దండకారణ్యం లేదా డీకే అని పిలిచారు.ఆదివాసీలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతం విలువైన ఖనిజాలు,ఇతర సహజ వనరులు సమృద్ధిగా ఉన్నాయి.సహజ వనరుల సంపదపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ కోరుకుంది.మావోయిస్టులు దానికి అడ్డంకిగా మారారు.ఆ కారణంగానే మావోయిస్టులను భారతదేశానికి 'అతిపెద్ద అంతర్గత భద్రతా ముప్పు' అని అప్పటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ 2009 లో ప్రకటించారు.

జగిత్యాల జైత్రయాత్ర నుంచి మొదలై

1978 సెప్టెంబర్ 7న జరిగిన జగిత్యాల జైత్రయాత్రలో 150 గ్రామాల నుంచి వేలాది మంది వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు. ఆనాడు జగిత్యాల మార్చ్ కొంతమంది భూస్వాములను కుదిపేసింది, వారు నగరాలకు పారిపోయారు.1980 జూన్ లో ఐదు నుంచి ఏడుగురు సభ్యులతో కూడిన ఏడు బృందాలు అడవుల్లోకి వెళ్లాయి.వాటిలో నాలుగు ఉత్తర తెలంగాణలో,రెండు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో, ఒకటి ఆదివాసీలు నివసించే మహారాష్ట్రలోని గడ్చిరోలికి వెళ్లాయి. మొదట్లో, ఆదివాసీలు మావోయిస్టుల ఉనికిని స్వాగతించలేదు. అయితే, త్వరలోనే ఆదివాసీలు మావోయిస్టుల అంకితభావానికి ఆకర్షించారు. 'ఉత్తర తెలంగాణలో ఒక పేరుమోసిన రౌడీ తన యజమాని, ఒక భూస్వామి తరపున ప్రజల్ని భయపెడుతుండేవాడు. అతను ఒక అమ్మాయిపై అత్యాచారం చేశాడు. ఆమె బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. రాడికల్ విద్యార్థులు ఆ రౌడీని బజార్‌లో ప్రజల ముందు నిలబెట్టారు. అతని చేతులను నరికి, ఒక దుకాణం లోపల గోడకు మేకులు కొట్టారు 'అని జాన్ మిర్డాల్ 'ఇండియా వెయిట్స్' (1986)లో వివరించాడు 1980 లలో నక్సలైట్ల కార్యకలాపాలను ఈ స్వీడిష్ రచయిత స్వయంగా అధ్యయనం చేశాడు.మావోయిస్టులలో చేరిన వారు తరచుగా వారి స్నేహితులు, తోబుట్టువులు ,ఇతర కుటుంబ సభ్యులను కూడా చేరేలా ఆకర్శించారు. క్రమంగా నగరాల్లోని సాధారణ ప్రజలలో,మధ్య తరగతి వర్గాల్లో మావోయిస్టుల పట్ల సానుభూతి కనుమరుగయ్యాయి. 2020 నుంచి మావోయిస్టు ఉద్యమం వేగంగా క్షీణిస్తూ వచ్చింది. మావోయిస్టులను వేటాడేందుకు ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టులు సహా ఆదివాసీల ప్రత్యేక బెటాలియన్ ఏర్పాటు చేసింది. 2018లో గణపతి నుంచి మావోయిస్టు చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన నంబాల కేశవ రావు అలియాస్ బస్వరాజు మే 21 న ఎన్‌కౌంటర్‌లో మరణించారు. నవంబర్ 18 న హిడ్మా ఎన్ కౌంటర్ జరిగింది. కొద్ది మంది మినహాయించి మొత్తం మావోయిస్టు నాయకత్వం తుడిచిపెట్టుకుపోతున్నట్టు కనబడుతున్నది.

ఇప్పుడున్న సమస్య ఎర్ర జెండాను కాపాడుకోవడం

'విప్లవోద్యమాన్ని ఆయుధానికి కుదించి మాట్లాడుతూ వున్నారు'అని విరసం పాణి ఇటీవల ఒక వ్యాసం లో అన్నారు.'జనతన సర్కారు అనే పుస్తకం రాసినాయనకు ఇప్పుడు ప్రత్యేకమైన ఇబ్బంది ఎదురైంది. ఇంతటి మహత్తరమైన సాయుధ పోరాటం కేవలం ఇద్దరు వ్యక్తుల ద్రోహంతో ముగిసి పోక పోయినా, ఇంతటి సంక్షోభంలో పడిపోతుంది అనుకోవడం ఏదైనా అవుతుంది కానీ, శాస్త్రీయ పద్ధతి మాత్రం కాదు. సంక్షోభంలో పడ్డది మావోయిస్టు పార్టీ నడిపిన సాయుధ పోరాటం మాత్రమే కాదు. రెండో ప్రపంచ యుద్ధానంతరం మొదలైన అన్ని సాయుధ పోరాటాలు ఇలాంటి సంక్షోభాలనే ఎదుర్కొన్నాయి. వర్గ పోరాటం సాయుధ పోరాటం రెండు ఒకటి కాదు. అవి రెండూ ఒకటేననడం పక్కా ట్రాట్స్కైట్ సిద్ధాంతం. సాయుధ పోరాటం వర్గ పోరాటానికి చెందిన ఒక రూపం.అది అత్యున్నత రూపం కాదా! అనే ప్రశ్న వస్తుంది. అది అత్యున్నత రూపం కనుకనే అది ఎప్పుడు మొదలు పెట్టాలన్న ప్రశ్న వస్తుంది. ఇంతటితో భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ముగుస్తుందా? ఆ ప్రమాదం లేకపోలేదు. ప్రపంచంలో చాలా దేశాలలో ఎర్ర జెండా కింద పడిపోయింది. కాకపోతే, ఇది ప్రపంచ వ్యాప్తంగా తిరిగి పైకి లేస్తున్న కాలం. ఈ కాలంలో సంక్షోభం వచ్చింది. ఇప్పుడున్న సమస్య ఎర్ర జెండాను కాపాడుకోవడం ఎట్లా అనేది' అని పాణిని ఆర్ఎస్ యూ ప్రధానకార్యదర్శిగా 1980 లలో పనిచేసిన అనాటమీ ప్రొఫెసర్,డాక్టర్ కానూరి విజయకుమార్ కౌంటర్ చేశారు.

దండకారణ్యంలో ఉద్యమం నష్టపోవడానికి

'మా పార్టీ అనుసరించిన అతివాద దుందుడుకువాద చర్యలన్నీ ఎక్కడికక్కడ అంతిమంగా శత్రువుకు ఉపయోగపడే ఆయుధాలయ్యాయి. దండకారణ్యంలోనూ అనేక డివిజన్లలో అవే వైఫల్యాలు 2011 నాటికే ఎదురై ఉద్యమం గడ్డు పరిస్థితులకు చేరినప్పటికీ, దక్షిణ, పశ్చిమ బస్తర్ లోని చిన్న పాకెట్లలో, మాడ్లోని పరిమిత పాకెట్ లో సాపేక్షికంగా బలమైన ప్రజాపునాది, అనుకూల టెర్రయిన్ కలిగివున్న చోట కూడా చాలా కాలం క్రితమే బలహీనతలు ముందుకు వచ్చినప్పటికీ సకాలంలో వాటిని అర్థం చేసుకోలేకపోయాం. సరిదిద్దుకోలేకపోయాం. దండకారణ్యంలో ఉద్యమం నష్టపోవడానికి సాపేక్షికంగా కొంత ఎక్కువ సమయం తీసుకున్నప్పటికీ, అంతిమంగా ఓటమి పాలే కావలసి వస్తోంది. ఏమైనప్పటికీ 'దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే' విధంగా సకాలంలో తప్పుల నుండి మా పార్టీ తేరుకోలేకపోయింది. బీజే సాక్ ఏరియాలోనూ వివిధ ప్రాంతాలలోని ఉద్యమాలు విలీనానికి ముందు నుండే దెబ్బతింటున్నప్పటికీ, సకాలంలో గుర్తించి సరిదిద్దుకొని ఫలితంగా, 2013నాటికి ఆ ఉద్యమం కూడా తాత్కాలిక వెనుకంజకు నెట్టబడింది. మా రెండు పార్టీల విలీనం దేశ ప్రజలలో, అంతర్జాతీయంగా విప్లవ శక్తులలో ఒక నూతన ఉత్సాహకర, ఉత్తేజపూరిత సందేశాన్నిచ్చి, ఒక అనుకూల వాతావరణాన్ని సృష్టించినప్పటికీ దానిని మేం మా బలానికి కొలమానంగానే చూశాం తప్ప విప్లవోద్యమాన్ని పురోగమింపచేయడానికి పరస్పర అనుభవాల నుండి నేర్చుకొని, తప్పులను అర్థం చేసుకొని,సరిదిద్దుకునే కృషి తగినంతగా చేయకపోవడంతో ఆ పరిస్థితులను సద్వినియోగం చేసుకోలేదు. దండకారణ్యం, బీజు సహా దేశంలో ఎక్కడా మా పార్టీ నాయకత్వంలో ఉద్యమాలు బలపడలేకపోతున్నాయి, చివరకు ఓటమికి చేరుకున్నాం. ఇలాంటి పరిస్థితులలో, పార్టీ తప్పుల నుండి నేర్చుకుంటూ తిరిగి విప్లవోద్యమాన్ని నిర్మించడానికి తాత్కాలికంగా సాయుధ పోరాట విరమణ చేయకుండా సాధ్యం కాదనేది తేలిపోయింది. మా పార్టీ జనరల్ సెక్రటరీ బసవరాజు శాంతి చర్చలకు సిద్ధపడడం వెనుక ఈ అవగాహనే బలంగా పని చేసింది' అని మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ గత సెప్టెంబర్ లోనే సుదీర్ఘ లేఖను విడుదల చేశారు.

మాకు బలమున్న ప్రతిచోటా ఎర్ర జెండా

కాగా 'మా వ్యవస్థాపక నాయకులు కామ్రేడ్ చారుమజుందార్, కన్హయ ఛటర్జీల అమరత్వం తర్వాత నక్సలైట్ల నిర్మూలించినట్టు ప్రచారం చేశారు. మాకు బలమున్న ప్రతిచోటా ఎర్ర జెండా ఎగురుతూనే ఉన్నది.దోపిడి,అణచివేత,దౌర్జన్యం,అత్యాచారం తదితర సామాజిక రుగ్మతలను పరిష్కరించాలి.ఇంత పెద్ద ఉద్యమంలో తప్పులు కూడా జరగొచ్చు.పార్టీలో వున్నవారందరూ వృత్తి విప్లవకారులు కాదు. వృత్తి విప్లవకారులయితే ఎలాంటి తప్పులు చేసినా వారిపై కచ్చితంగా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటాం. మరోవైపు లక్షలాది మందితో కూడిన ప్రజా సంఘాలు ఉన్నాయి. 2026 మార్చి నాటికి భారత్ నుంచి మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం అని అమిత్‌షా ప్రకటించారు. 2023లో ఛత్తీస్‌గఢ్‌లో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బిజెపి ప్రభుత్వం ఏర్పడితే,రాష్ట్రంలో మావోయిజాన్ని అంతం చేస్తామని అమిత్ షా అన్నారు.ప్రభుత్వం మారిన తర్వాత, ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల అణచివేతకు కార్యాచరణ ప్రణాళిను అమలుచేయడం ప్రారంభించారు.ప్రభుత్వం ముందెన్నడూ ప్రవేశించలేని అబూజ్ మాడ్‌లోని ప్రాంతాల్లో కూడా ఎన్‌కౌంటర్లు నిరంతరం జరుగుతున్నాయి.2026 మార్చి 31 లోపు మావోయిజం సమూలంగా తుడిచిపెట్టుకుపోతుందని అమిత్‌షా స్పష్టం చేశారు. గతంలో బిజెపి రమణ్‌సింగ్ 15 సంవత్సరాల పాలనలో మా ఉద్యమం చాలా గొప్ప విజయాలు సాధించింది.1980 నుండి 2003 వరకు మా ఉద్యమం సాధించిన దానికంటే 2003 నుండి 2018 వరకు మేం గొప్ప విజయాలు సాధించాం.

ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు తగిన సమాధానం

బీజేపీ పాలనలోనే సల్వాజుడుంను నిర్మూలించాము. ఆపరేషన్ గ్రీన్‌హంట్ కు తగిన సమాధానమిచ్చాం.ఆపరేషన్ సమాధాన్‌ను అర్థం చేసుకున్నాం.పరిష్కారాన్ని కనుగొన్నాం.2003లో బీజేపీ మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు బెటాలియన్ కాదు కదా మాకు ఒక్క కంపెనీ కూడా లేదు.కానీ వారి పాలనాకాలంలో ఎన్నో కంపెనీలు ,ప్లాటూన్లు,బెటాలియన్లు కూడా ఏర్పాటు చేసుకున్నాం. తాడ్‌మెట్లలాంటి అనుభవాలు వచ్చాయి.జీరంఘాట్ అనుభవాలు కూడా చూశాం.వాటినుండి నేర్చుకున్నాం. ప్రజలు తమ పిల్లలను వందల సంఖ్యలో పిఎల్‌జిలో చేర్చి వీర గెరిల్లాలుగా మార్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు.80వ దశకంలో మట్టి కుండలో వండుకుని,చింతపండు రసంతో ఒక పూట తినే,అర్ధనగ్నంగా ఉండిన ఆదివాసీలు ఇప్పుడు ఈ దేశ అణగారిన ప్రజల ముందు ఆదర్శంగా ఒక ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని,ప్రజల ప్రభుత్వాన్ని (జనతన సర్కార్) నిలబెట్టారు.ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంగా ఏర్పడి 23 ఏళ్లు దాటింది. భాజపా అత్యధికకాలం పాలన చేసింది. పిల్లలకు తమ మాతృభాషలో విద్య లభించలేదు. ఈనాడు జనతన సర్కార్‌లో పిల్లలు తమ మాతృభాషలో సంతోషంగా చదువుకొంటున్నారు.ఈ విజయాలను సాధించడానికి,బస్తర్ ప్రజలు చాలా విలువైన త్యాగాలు చేయవలసి వచ్చింది.బస్తర్ అడవుల్లో రక్తం ప్రవహించింది.ఎన్నో నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చింది.విప్లవంలో యివన్నీ అనివార్యమైనవి.ఈ నష్టాల్లో చాలా వరకు అనవసరమైనవి కూడా వున్నాయి.వాటి నుంచి గుణపాఠాలు తీసుకొని, విష్ణు దేవ్‌సాయి పాలనా కాలంలో తప్పకుండా ముందు కెళ్లడానికి ప్రయత్నం చేస్తాం.విప్లవం అంటేనే త్యాగాలతో ప్రపంచాన్ని మార్చడం.విప్లవం అంటే ఒక పార్టీ స్థానంలో మరో పార్టీ రావడం కాదు.అది కాంగ్రెస్ కావచ్చు, బిజెపీ కావచ్చు లేదా ఏ పార్టీ అయినా కావచ్చు. విప్లవం అంటే అణగారిన,దోపిడీకి గురైన,పేద,శ్రామిక ప్రజలు ఏకమై దోపిడీ,పాలకవర్గాలనుంచి అధికారాన్ని తీసుకోవడం.ప్రజలు చరిత్రను సృష్టిస్తారు. మేము మా ఆయుధాలను ఎప్పటికీ వదులుకోము.లొంగిపోయే సమస్య అసలు లేనేలేదు'' అని బస్తర్ లోని ఒక జర్నలిస్టు రాసి పంపిన ప్రశ్నలకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి శ్రీనివాస్ గతంలో ఇలా జవాబిచ్చారు.శ్రీనివాస్ పేరిట గణపతి జవాబులు ఇచ్చినట్టు తెలుస్తోంది.ఆ లేఖ రాసిన సమయానికి ఆపరేషన్ కగార్ లేదు.ఈ స్థాయిలో అణచివేత లేదు.ముప్పేట దాడులూ లేవు.అగ్ర నాయకుల ఎన్ కౌంటర్లు లేవు.పొలిట్ బ్యూరో సభ్యులు,కేంద్రకమిటీ సభ్యులు లొంగిపోయిన దాఖలాలు లేవు.ఇప్పుడు మావోయిస్టు పార్టీ విప్లవోద్యమం చివరి దశలో ఉన్నట్టు విశ్లేషణలు కొనసాగుతున్నవి.

కొస మెరుపు

'ఇక మావోయిస్టు పార్టీ క్యాడర్ ప్రభుత్వానికి లొంగిపోవడమో లేదా భద్రతా బలగాల చేతిలో మరణించడమో తప్ప మరో మార్గం కనిపించడం లేదు. ఆ పార్టీ, పార్టీ నడిపిన మహత్తర విప్లవ పోరాటాలు ఇక చరిత్రగానే మిగిలిపోవచ్చు' అని ప్రముఖ జర్నలిస్టు,రచయిత రాహుల్ పండిత ఒక ఛానల్ లో మాట్లాడుతూ అన్నారు.

(వ్యాస రచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)



'తక్కెళ్లపల్లి' మాటలు ఆచరణ సాధ్యమేనా!!

'2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ పీపుల్స్ వార్, జనశక్తికీ మధ్య చర్చలు జరిగాయి. భూస్వాముల భూములను భూమిలేని నిరుపేదలకు పునఃపంపిణీ చేయాలనే డిమాండ్ ను అంగీకరించడానికి ప్రభుత్వం తిరస్కరించడంతో చర్చలు భగ్నమయ్యాయి. ఆ సమయంలోనే పీపుల్స్ వార్, పార్టీ యూనిటీ, ఎంసీసీ విలీనం జరిగి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడింది. ఒక సంవత్సరం తర్వాత, 2005లో మావోయిస్టులను తుడిచి పెట్టడానికి ఛత్తీస్ గడ్ లోని బీజేపీ ప్రభుత్వం సల్వా జుడుమ్ అనే సాయుధ చర్యలను ప్రారంభించింది. ఈ దాడిలో రాజ్యం ఆదివాసీ గ్రామాలను తగులబెట్టించింది. ఆదివాసీ మహిళల మీద సామూహిక అత్యాచారాలు చేయించింది. ఆదివాసీలను హత్య చేయించింది. 2011లో సుప్రీం కోర్టు సల్వా జుడుమ్ రాజ్యాంగ వ్యతిరేకమని తీర్పు ఇచ్చినప్పటికీ ఈ దమనకాండ కొనసాగింది. ఆదివాసీల మీద పాశవికంగా జరుగుతున్న మానవహక్కుల అణచివేతకు వ్యతిరేకంగా నేను గొంతెత్తగానే, బీజేపీ ప్రభుత్వం నన్ను హత్య చేయించడానికి ప్రయత్నించింది. నేను నడుపుతుండిన పదహారు ఎకరాల గాంధేయ ఆశ్రమాన్ని 2009లో బుల్డోజర్లతో నేలమట్టం చేయించింది. నన్ను ఛత్తీస్ గడ్ నుంచి బహిష్కరించింది. 2026 మార్చ్ 31నాటికి నక్సల్స్ ను పూర్తిగా నిర్మూలిస్తానని కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా ప్రకటించారు. గత రెండు సంవత్సరాలలో భద్రతా బలగాలు దాదాపు రెండు వేల మంది ఆదివాసీలను, చిన్నపిల్లలను, స్త్రీలను, నక్సల్ కార్యకర్తలను చంపివేశాయి. తాము ఆయుధాలు విసర్జించాలని అనుకుంటున్నామని, ప్రజా సమస్యల మీద పని చేస్తామని' తక్కెళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ రూపేష్ చెప్పాడు. ఇది సాధ్యమేనా? భారతదేశంలో ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ రాజకీయాలు నడపవచ్చునా? బస్తర్ భూమిని అమిత్ షా,అదానీకి అప్పగించాక ఈ నిరాయుధ నక్సల్ నాయకులు ప్రజాస్వామికంగా ఆదివాసీల నిరసనను సంఘటితం చెయ్యగలరా? దాన్ని అమిత్ షా సహిస్తారా? ఈ భావజాలంతో ఉన్న నిరాయుధ కార్యకర్తలను బస్తర్ లో ప్రభుత్వం పని చెయ్యనిస్తుందా? మూలవాసి బచావో మంచ్ అనే ఆదివాసి యువకుల నిరాయుధ సంస్థను ప్రభుత్వం నిషేధించిన సంగతి తెలిసిందే.



విప్లవోద్యమ ప్రభావం, పరిధి చాలా విస్తారం

విప్లవోద్యమాన్ని చాలా సంకుచితంగా, కేవలం సాయుధ చర్యలకు పరిమితంగా చూస్తున్నారని మావోయిస్టు పార్టీ మద్దతుదారులంటున్నారు. బస్తర్ నుంచి సాయుధ విప్లవకారులను వెళ్లగొట్టిన తర్వాత కూడా ప్రభుత్వం చేతులు కట్టుకొని కూర్చోదు. 2026 మార్చ్ 31 తర్వాత భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)ని, దాని అనుబంధ సంఘాల మీద నిషేధం ఎత్తివెయ్యరు. అన్ని వైపుల నుండి విప్లవోద్యమం మీద ఇన్ని రకాల దాడులు జరుగుతున్నా ఆ ఉద్యమం ఎంతో ప్రజాస్వామికంగా వ్యవహరిస్తుంది. విప్లవ రాజకీయాలు అంతమయిపోతాయని అనుకుంటే పొరపాటేనని కొందరు వాదిస్తున్నారు. ఎందుకంటే విప్లవోద్యమ ప్రభావం, పరిధి చాలా విస్తారమైంది.దేశంలో పైపై మెరుగులను చూసి నక్సల్ బరీ సాయుధ పోరాట రాజకీయాలకు కాలం చెల్లిపోయిందని వీలునామా రాస్తున్నారని మరికొందరు వ్యాఖ్యానిస్తున్నారు. దీర్ఘకాలిక పోరాటానికి కాలం చెల్లిందా, చెల్లలేదా? సాయుధ పోరాట పంథా ఇప్పుడు నడుస్తుందా,నడవదా? చైనా పంథానా? రష్యా పంథానా? అనే రకరకాల చర్చలు తెలుగు సమాజంలో జరుగుతున్నాయి. 2005లో లొహండిగూడలో టాటా కంపెనీ స్టీల్ ప్లాంట్ పేరుతో భూముల ఆక్రమణకు దిగినప్పుడు అక్కడ మావోయిస్టు పార్టీ ఉనికే లేదు.అయినా సరే.. ప్రతిఘటించకపోతే భూములు దక్కవని, భూములు కోల్పోతే వలస కూలీలుగా మారిపోయి దిక్కులేని బతుకు బతకాల్సి వస్తుందనే ఎరుకే వారిని చేతికి అందిన పనిముట్టునే ఆయుధంగా మల్చుకొని వీధుల్లోకి వచ్చేలా చేసింది.1970 దశకం చివరలో దక్షిణ బస్తర్‌లోని ఒక మారుమూల పల్లెలో హిడ్మ పుట్టాడు.ఆ ప్రాంతంలో ఆ తరానికి చెందిన అనేక మంది యువకుల్లానే హిడ్మ కూడా 1996,1997 ప్రాంతాల్లో దళంలో చేరాడు.హిడ్మను ప్రజలే తయారు చేసుకున్నారు.తమ గ్రామాలను,తమ ప్రాణాలను,తమ అడవులను,తమ నదులను.. మొత్తంగా తమ ప్రాంతాన్ని కాపాడే యోధుడిగా వారు ఆయనను కొలిచారు.ఆయన చనిపోయాక హిడ్మాను తమ స్వార్థ ప్రయోజనాల కోసం 'మార్కెటింగు' చేసుకునే ముఠాలు కూడా తయారవడం ఒక విషాదం.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

నేడే రెండో విడత పంచాయతీ పోలింగ్



ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్13: రెండవ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత హనుమకొండ జిల్లాలోని ఐదు మండలాల్లో ఆదివారం రోజున జరగనున్న పోలింగ్ కు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం తెలిపారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, హసన్ పర్తి మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో, ఐనవోలు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్, వేలేరు, పరకాల మండల కేంద్రాలలోని ఎంపీడీవో కార్యాలయాల్లో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ద్వారా పోలింగ్ సామగ్రితో ఆయా మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సిబ్బంది బయలుదేరి వెళ్లారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పోలింగ్ కేంద్రాలలో ఆదివారం జరగనున్న పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో రెండో విడతలో ఎన్నికలు జరుగుతున్న ఐదు మండలాల్లో ఆదివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పోలింగ్ నిర్వహణకు పోలింగ్ కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హనుమకొండ జిల్లాలో రెండో విడతలో ఈనెల 14న(ఆదివారం రోజున) ఐదు మండలాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ధర్మసాగర్, హసన్ పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల్లో మొత్తం ఓటర్లు 1,28,315 ఉన్నారు. ఇందులో పురుషులు 62692, మహిళలు 65621, ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఐదు మండలాల్లో మొత్తం గ్రామ పంచాయతీలు 73, వార్డులు 694 ఉన్నాయి. రెండో విడతలో వార్డులు, సర్పంచ్ స్థానాలు కలిపి ఏకగ్రీవ గ్రామపంచాయతీలు 5 ఉన్నాయి. ఒక గ్రామపంచాయతీకి సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. ఎన్నికలు జరిగే గ్రామపంచాయతీలు 67 ఉండగా ఇందులో పోటీలో ఉన్న సర్పంచ్ అభ్యర్థులు 248 కాగా పోటీలో ఉన్న వార్డు సభ్యుల అభ్యర్థులు 1442 మంది ఉన్నారు. మొత్తం వార్డులు 694 ఉండగా ఇందులో ఏకగ్రీవమైన వార్డులు 120 ఉన్నాయి. పోలింగ్ జరిగే వార్డు స్థానాలు 574 ఉన్నాయి. ఐదు మండలాల్లో మొత్తం పోలింగ్ కేంద్రాలు 658, ప్రిసైడింగ్ అధికారులు 658, ఓపివోలు 961 (మొత్తం పిఓ, ఓపిఓలు 1619), 23మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారు.



ఎన్నికలలో సహకరించలేదని

మారణాయుధాలతో దాడి

- నలుగురు వ్యక్తుల అరెస్ట్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 13 : జిల్లాలోని రెంజల్ మండలం వీరన్న గుట్ట గ్రామంలో గ్రామపంచాయతీ ఎన్నికలలో సర్పంచ్ రిజ్వానా బేగంకు మద్దతు ఇవ్వలేదన్న కక్షతో దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు బోధన ఏసీపీ బోధన్ ఎసిపి శ్రీనివాస్ తెలిపారు. వీరన్న గుట్టకు చెందిన జామీలుద్దీన్, అఫ్సర్, హైమద్ లు గత శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నర గంటల ప్రాంతంలో రెంజల్ మండలంలోని వీరన్న గుట్ట గ్రామంలో గల నూర్ మజీద్ లో ప్రార్థనలు ముగిసిన తర్వాత అభ్యర్థి రిజ్వానా బేగం కొడుకులైన ఇబ్రహీం, అబు బాకర్ అనుచారులు సిరాజ్, వాజిద్, ఇలియాస్, అవేజ్, ఆరిఫ్ మోయిస్ ఖాన్, మరి కొంతమంది చంపాలనే ఉద్దేశం తో ముందస్తు ప్రణాళికతో హుండాయ్ వేర్న కార్ నెంబర్ MH 46 AL 6852 లో మరణ ఆయుదాలతో ప్రార్థన మందిరంలో ప్రార్థన జరిగిన తర్వాత ప్రార్థన మందిరం ఆవరణలో మీటింగ్ పెడతామని చెప్పి దాడి చేసినారు. అందులో జమీలుద్దీన్, అప్సర్, హైమద్ లను గాయపరిచారు. వారు ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసి నిందితులు అయిన ఇబ్రహీం, అబూబకర్, వాజిద్ ఆవేజ్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మిగతా నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితుల నుంచి కారు, రెండు కత్తులు, ఐరన్ రాడ్, కర్రలు, 4 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బోధన్ రూరల్ విజయ్ బాబు, రెంజల్ ఎస్సై చంద్రమోహన్, సిబ్బంది మహదేవ్, గంగాధర్, శ్రీకాంత్, ప్రవీన్, శివ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకుల ఇంటింటా ప్రచారం

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 13 : నర్వ మండల పరిధి లోని రాయి కోడ్ 277, 278 బూత్ లలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డి కృష్ణా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియజకవర్గ నాయకులు ఎన్ఆర్ఐ పోలీస్ చంద్ర శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పంచాయతి ఎన్నికల్లో రాయికోడ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి పి రవి కుమార్ (ఫుట్ బాల్) గుర్తు, 7వ వార్డు సబ్యూలు మ్యాతరీ గోపాల్ (స్టూల్) గుర్తు పై ఓటు వేసి గెలిపించాలని ఇతర వార్డుల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు మద్దతుగా ఇంటింటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ప్రచారంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభ్యర్థులు, మహిళలు, యువకులు, తదితరులు విస్తృతంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ ప్రచారం చేసిన కాంగ్రెస్ పార్టీ హవానే ఉందని, భారీ మెజారిటీతో విజయం సాధించాడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి, వార్డు సబ్యూలు, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ సినీయర్ నాయకులు, యూవ నాయకులు, మహిళాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా

డివిజన్లు ఏర్పాటు చేయాలి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 13: పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని జిహెచ్ఎంసి డివిజన్ల విభజన ప్రక్రియను జనాభా మరియు ఓటర్ల ప్రాతిపదికన చేపట్టాలని, పటాన్ చెరు కేంద్రంగా జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని బల్దియా కమిషనర్ ఆర్ వి కర్ణన్ ను పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని బల్దియా కార్యాలయంలో కమిషనర్ ని కలిసి నూతన డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను నివేదిక రూపంలో అందించారు. ఈ సందర్భంగా ప్రజలు, పుర ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను కమిషనర్ కు వివరించారు. ప్రధానంగా అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో లక్ష 20 వేలకు పైగా ఓటర్లు, రెండు లక్షల జనాభా నివసిస్తుందని తెలిపారు. పాత అమీన్పూర్ మండలం, అమీన్పూర్ మున్సిపల్ కలిపి కేవలం రెండు డివిజన్లు మాత్రమే ఏర్పాటు చేశారని.. పరిపాలన వికేంద్రీకరణ, సౌలభ్యం కోసం కిష్టారెడ్డిపేట, బీరంగూడ, అమీన్పూర్, పిజిఆర్ కాలనీల పేరిట 30 వేల ఓటర్లకు అనుగుణంగా నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో తెల్లాపూర్, ముత్తంగి డివిజన్లు ఏర్పాటు చేశారని, వీటి పరిధిలో గల రెండు పడక గదుల ఇళ్ళ సముదాయాల ఓటర్లకు అనుగుణంగా నాలుగు డివిజన్లు అనగా తెల్లాపూర్, వెలిమల, కొల్లూరు, ముత్తంగి పేరుతో నాలుగు డివిజన్లు ఏర్పాటు చేయాలని కోరారు. తెల్లాపూర్ పరిధిలోని 450 గృహాలు ప్రస్తుతం భారతీ నగర్ డివిజన్ పరిధిలో ఉన్నాయని, వీటిని తిరిగి తెల్లాపూర్ డివిజన్లో కలపాలని కోరారు. ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండే విధంగా పటాన్చెరు కేంద్రంగా జోనల్ కార్యాలయం సైతం ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కమిషనర్.. అభ్యంతరాలను, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.



వంద శాతం పోలింగ్ జరగాలి

- జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్
- లింగం పేట, ఎల్లారెడ్డి, నిజాం సాగర్ మండలాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల సందర్శన

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 13: రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా రెండవ విడత ఎన్నికలు ఆదివారం డిసెంబర్ 14వ తేదీన జరగనున్నాయి. మాక్ పోల్ అనంతరం ఉదయం 7.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముందుగా లింగం పేట మండలం, ఎల్లారెడ్డి మండలం, నిజాం సాగర్ మండలాల లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు .పంపిణీ కార్యక్రమం ముగిసిన వెంటనే తమకు కేటాయించిన కేంద్రాలకు సకాలం లో చేరుకొని ఎన్నికల సామాగ్రి నీ ఒకసారి చెక్ చేసుకొని సిద్దంగా ఉండాలని,ఉదయం 7 గంటల కు పోలింగ్ ప్రారంభించి మధ్యాహ్నం 1.00 గంటకు ముగించాలన్నారు. పోలింగ్ వంద శాతం జరగాలన్నారు.ఈ సందర్భంగా పోలింగ్ కొరకు అన్ని సిద్దంగా ఉన్నాయని తెలిపారు. శీతాకాలం దృష్ట్యా ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరిగిందని తెలిపారు. అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, బస్ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీవో పార్థ నరసింహా రెడ్డి ఎన్నికల అధికారులు, తదితరులు ఉన్నారు.



రాజకీయ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

ప్రతిపక్షం, గుండాల,డిసెంబర్ 13: గుండాల మండలం ముత్తాపురం గ్రామంలో నిర్వహించిన ఆదివాసి సంక్షేమ పరిషత్ ప్రచార కార్యక్రమంలో మండల అధ్యక్షులు పూనేం రమణబాబు మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు తమ ఓటుతో రాజకీయ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.రాజ్యాంగం ప్రకారం ఆదివాసీలకు కేటాయించాల్సిన సర్పంచ్ స్థానాలు గిరిజనేతర రాజకీయ పార్టీలు అడ్డదారుల్లో దక్కించుకుంటున్నాయని, అమాయక ఆదివాసీలను బెదిరించి ఓట్లను దండుకుంటున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఆదివాసీలను గుర్తు చేసుకునే రాజకీయ పార్టీలు, గెలిచిన తర్వాత వారిని కీలు బొమ్మలుగా మార్చుకుంటున్నాయన్నారు.70 ఏళ్ల స్వాతంత్ర్యం గడిచినా ఇంకా కొంతమంది ఆదివాసీ గ్రామాలకు రహదారులు లేకపోవడం వైఫల్యానికి నిదర్శనం అన్నారు. ఏ రాజకీయ పార్టీ నాయకులు కూడా 1/70, పేసా చట్టాల అమలు కోసం గళమెత్తకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.రాజకీయ పార్టీలకు నిజంగా ధైర్యం ఉంటే ఏజెన్సీ ప్రాంతంలో 1/70, పేసా చట్టాలను వెంటనే అమలు చేయాలని ఆయన సవాల్ విసిరారు. ఆదివాసీ యువత రాజకీయాల్లోకి రాగా,"జల్-జంగిల్-జమిన్" నినాదంతో హక్కుల కోసం ఉద్యమించాలని పూనేం రమణబాబు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తూరుబాక, ముత్తాపురం గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

రెండవ విడత పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించిన కలెక్టర్, అబ్జర్వర్



ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 13 : గ్రామ పంచాయతీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి పోలింగ్ సామాగ్రి తో సిబ్బంది తరలింపు, వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు, పోలింగ్ కేంద్రాలలో వసతులు, పోలీసు బందోబస్తు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, నిఘా బృందాల పనితీరు పర్యవేక్షణ తదితర అంశాలపై ఇప్పటికే అన్ని కసరత్తులు పూర్తి చేశామని అన్నారు. గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలు ఈ నెల 14న జరుగనున్న నేపథ్యంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, ఎన్నికల సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్ వేర్వేరుగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. నిజామాబాద్ డివిజన్ లోని ధర్పల్లి, డిచ్పల్లి, ఇందల్వాయి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్, సిరికొండ, ఆర్మూర్ డివిజన్లోని జక్రాన్పల్లి మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీలకు జరిగే ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా, జిల్లాలో రెండవ విడతగా ఈ నెల 14న పోలింగ్ నిర్వహించనున్న మండలాల్లో పోలింగ్, కౌంటింగ్ కోసం పక్కాగా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి సదుపాయాలను సరిచూసుకోవడం జరిగిందన్నారు. తాగునీరు, వీల్ చైర్ వంటి వసతులతో పాటు, ప్రతి పోలింగ్ స్టేషన్లో వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాల్సిందిగా ఆదేశించామని తెలిపారు. ప్రతి పీ.ఎస్ లో ఓటర్లకు సహకరించేలా బీ.ఎల్.ఓలతో కూడిన హెల్ప్ డెస్క్ లు అందుబాటులో ఉంచుతున్నామని అన్నారు. 44 గంటల సైలెన్స్ పీరియడ్ లో పాటించాల్సిన నిబంధనలు అమలయ్యేలా నిఘా బృందాలు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. రెండవ విడతలో మొత్తం 1476 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,38,838 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం 1476 మంది ప్రిసైడింగ్ అధికారులను, 1937 మంది ఓపీవోలను నియమించామని అన్నారు. మొదటి విడత తరహాలోనే మలి విడత ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు.



మంచిర్యాల నియోజకవర్గంలో

కాంగ్రెస్ ఘన విజయం

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 13: మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించినది నియోజకవర్గంలో హాజీపూర్ లక్షపేట దండ పెల్లి మండలాల్లో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో మూడు మండలాల్లో అధిక మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంది నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను చూసి ఎక్కువ మంది ఓటర్లు కాంగ్రెస్ పార్టీని ఆదరించినట్లుగా ఓటర్లు చెప్పుకుంటున్నారు పి ఎస్ ఆర్ సూచనల మేరకు ఆయన సతీమణి కొక్కిరాల సురేఖ నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రచార విషయంలో ముందుండి కాంగ్రెస్ పార్టీని నడిపిం చింది నిరంతరం గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు అండదండలుగా నిలిసి ప్రచారంలో ముందుకు సాగింది ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలను ఓటర్లకు చేరవేలంలో ప్రధాన పాత్ర పోషించి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపును భుజాన వేసుకుంది ఓటర్లను ఒకే త్రాటిపైకి తీసుకువచ్చి అభ్యర్థుల గెలుపును సులువు చేసింది జరిగిన ఎన్నికలలో టిఆర్ఎస్ బిజెపి నామ మాత్ర ఫలితాలను సంతరించుకున్నాయి. హాజీపూర్ మండలంలో 12 గ్రామ పంచాయతీలలో 8 కాంగ్రెస్ 2 టిఆర్ఎస్ ఒక్కటి బిజెపి మరొకటి రెబల్ కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు బుద్ధి పల్లి గ్రామపంచాయతీలో దుర్గం సంధ్య కాంగ్రెస్ చిన్న గోపాల్పూర్ జుగునాక రాజేష్ కాంగ్రెస్ దొనబండ వేతు రమాదేవి బిజెపి ఘనపూర్ గోనిగంటి స్వప్న కాంగ్రెస్ హాజీపూర్ మాధవరపు శ్రీలత టిఆర్ఎస్ కర్ణమామిడి బొద్దు భూమయ్య కాంగ్రెస్ నాగారం పెంద్రం మహేశ్వరి కాంగ్రెస్ పడతలపల్లి దొండ యేసయ్య కాంగ్రెస్ పెద్దంపేట జాడి వెంకటేష్ టిఆర్ఎస్ రాపల్లి మిట్టపల్లి రామ్ రెడ్డి కాంగ్రెస్ ర్యాలీ జూ నాక అరుణ కాంగ్రెస్ టీకన్నపల్లి బూర్ల తిరుపతమ్మ రెబెల్ కాంగ్రెస్ గా గెలుపొందడం జరిగింది కాగా ఎన్నికలలో ఎత్తులకు పై ఎత్తులతో కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించి గెలిపించగలిగిన ఘనత నాయకత్వానికి దక్కింది ఎన్నికల ప్రచారంలో నిత్యం అభ్యర్థులను ముందుకు నడిపించడంలో మంచిర్యాల జిల్లా పట్టణ అధ్యక్షుడు తుమ్మల నరేష్ పూజ తిరుపతి గడ్డం సతీష్ యాదవ్ జగన్ సురేందర్ సాయి తేజ వద్దె రాజమౌళి ఖదీర్ నల్ల వెంకటేష్ లతోపాటు పెద్ద ఎత్తున మహిళలు ప్రచారంలో పాల్గొని అభ్యర్థులకు విజయానికి నాందిగా నిలిచినట్టు తెలుస్తుంది.



దేశంలో రైల్వే వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నాం. 2009--14 మధ్య 7,599 కిలోమీటర్లు కొత్త ట్రాక్ వేస్తే, 2014--24 వరకు తాము 34,428 కిలోమీటర్లు నిర్మించాం. రూ. 6,74,920 కోట్లతో కొత్త రైల్వే లేన్లు, మల్టీ ట్రాకింగ్, గేజ్ కన్వర్షన్ చేపట్టాం. ఇప్పటికే 12,769 కిలోమీటర్లల నిర్మాణం పూర్తయింది. పెరుగుతున్న సరకు రవాణా దృష్ట్యా నెట్వర్క్ కెపాసిటీ పెంచుతున్నాం.

- కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

ప్రాంతీయం



పోలింగ్‌కు సర్వం సిద్ధం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 13: జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో రెండవ విడత 8 మండలలో ఉన్న 149 గ్రామ పంచాయతీలకు నేడు ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ మెదక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్ పరిశీలించారు. డిఆర్ఓ భుజంగరావు ఆధ్వర్యంలో ఎన్నికల పోలింగ్ సామాగ్రిని,బ్యాలెట్ బాక్స్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్స్, పోలింగ్ సామాగ్రిని తీసుకొని బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు.ఎనిమిది మండలాల్లో 1,76,168 మంది మొత్తం ఓటర్లు ఉండగా, అందులో 84,695 మంది పురుషులు, మహిళలు 91,470 మంది ఓటర్లుకాగా ఇతరులు ఇద్దరు ఉన్నారు. ఈ క్రమంలో 149 గ్రామ పంచాయతీలకు 7 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.మిగిలిన 142 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా 544 మంది అభ్యర్థులు భరీలో ఉన్నారు.1290 వార్డులకు గాను 254 వార్డులు ఏకగ్రీవం కాగా,రెండు వార్డులకు నామినేషన్ దాఖలు కాలేదు.మిగిలిన 1034 వార్డులకు 2,952 మంది వార్డు సభ్యులు భారీ లో ఉన్నారు.పోలింగ్ నిర్వహణ కోసం 143 ఆర్వోలు, పీవోలు 1246, ఓపీఓలు 1457 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు.

కొమురవెల్లి మల్లన్న కళ్యాణానికి సర్వం సిద్ధం చేయాలి

- ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 13: కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి కళ్యాణం ఈ నెల 14 వ తేదీన ఉదయం 10:45 గంటలకు జరుగుతున్నందున స్వామి వారి కళ్యాణం ముందస్తు ఏర్పాట్లను శనివారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మల్లికార్జున స్వామి వారి కళ్యాణం జరిగే తోటబావి ప్రాంతంలో కళ్యాణ మండపం డెకరేషన్, వీఐపి సిట్టింగ్, సామాన్య భక్తులకు కుర్చీలు, మీడియా గ్యాలరీ ఏర్పాట్లు చుట్టూ బారి కేడ్లు ఏర్పాట్లను పరిశీలిస్తూ అన్ని అరేంజ్మెంట్ లు కళ్యాణం వైభవంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు ఈ రోజు పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. కళ్యాణ మండప ప్రాంతంలో భక్తులకు తాగునీటి వసతి కల్పించాలని, నిరంతర విద్యుత్ సరఫరా, మైక్ సిస్టమ్ అన్ని ఒకసారి చెక్ చేసుకోవాలి. స్వామి వారి కళ్యాణం కావున ఎక్కువ మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తోపులాటలు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కళ్యాణ మండపం చుట్టూ, ఆలయ పరిసర ప్రాంతాలు, భక్తులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు ఎల్లపుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అలాగే తాగునీటివసతి మిషన్ భగీరథ, బయట మరుగుదొడ్ల పరిశుభ్రంగా పాటించాలని తెలిపారు. గ్రామపంచాయతీ కార్మికులు, ఆలయ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు అందరూ సమన్వయంతో ఆలయ పరిసర ప్రాంతాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేవిధంగా చూసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం 50 పడకల అతిథి గృహా సముదాయ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అతిథి గృహ పనులు ఆశించిన స్థాయిలో వేగంగా చేయట్లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎలక్ట్రిసిటీ కనెక్షన్, మిషన్ భగీరథ పైప్ లైన్ తో వాటర్ సప్లై, పెయింటింగ్, డోర్స్, విండోస్ అవర్చడం వివిధ పనులు మొత్తం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అందరి అధికారుల సమన్వయంతో అతిథి గృహ సముదాయం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.



రెండో విడత పోలింగ్ సర్వం సిద్ధం

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 13: స్థానిక సంస్థల రెండో విడత పోలింగ్కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ని మిరుదొడ్డి, అక్బర్ పేట బొంపల్లి మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీలకు పోలింగ్ సామాగ్రిని తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేపు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సర్పంచ్ ఎన్నికలు కొనసాగుతాయని ఆర్డిఓ సదానందం వెల్లడించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా ,పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



ఎన్నికల జరిగే 10 మండలాల్లో

ప్రభుత్వ సెలవు

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం సిద్దిపేట, డిసెంబర్ 13: సిద్ధిపేట జిల్లాలో ఈనెల 14న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత సందర్భంగా 10 మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రభుత్వ సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. హైమావతి తెలిపారు. జిల్లాలోని అక్కన్నపేట్ భూంపల్లి, బెజ్జంకి, చిన్నకోదూర్, దుబ్బాక, మిర్దొడ్డి, నంగునూరు, నారాయణరావుపేట్, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్ , తొగుట మండలాల పరిధిలోని గ్రామాలలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల 2వ విడత ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సంబంధిత 10 మండలాలలోని గ్రామాల పరిధిలోగల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రభుత్వ సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు . ఎన్నికలలో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు మరియు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది,



గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 13: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ఇటీవల సర్పంచ్ ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ముందుకు సాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు. దుబ్బాక నియోజకవర్గం పరిధిలోని రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం దుబ్బాక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారికి ఘనంగా సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని గెలుపొందిన ప్రజాప్రతినిధులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ...రాయపోల్, దౌల్తాబాద్ మండలాలు బీఆర్ఎస్ పార్టీకి కంచుకోటలని, తెలంగాణ ఉద్యమ కాలం నుంచే ఈ ప్రాంత ప్రజలు మాజీ సి ఎం కేసీఆర్ నాయకత్వంపై అచంచల విశ్వాసంతో పార్టీకి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ రెండు మండలాల్లో అత్యధిక సంఖ్యలో బీఆర్ఎస్ సర్పంచ్‌లను గెలిపించిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు, ఓటర్లకు పేరు పేరున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇదే ఉత్సాహం, ఐక్యతతో మిగిలిన అన్ని మండలాల్లో కూడా బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, గెలిచిన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్దే లక్ష్యంగా పనిచేయాలని, ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మన ప్రభుత్వం అధికారంలో లేకున్నా, దుబ్బాక నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేందుకు నిధుల కోసం పోరాడతానని, ప్రజల సమస్యలపై నిరంతరం స్వరం వినిపిస్తానని హామీ ఇచ్చారు.గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా అందరూ ఐక్యమత్యంతో ముందుకు సాగాలని తెలిపారు.వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ని మళ్లీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయడమే మన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రాష్ట్ర నాయకులు బి. మనోహర్ రావు , రణం శ్రీనివాస్ గౌడ్,రొట్టె రాజమౌళి,కొత్త కిషన్ రెడ్డి మాజీ జడ్పీటిసి కడత ల రవీందర్ రెడ్డి పలువురు బి ఆర్ ఎస్ నాయకులు , మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'రెండవ దఫా' సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 13: రెండవ విడతలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు.గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికలు 2025లో భాగంగా కరీంనగర్ జిల్లాలో 14న రెండవ విడత పోలింగ్ జరగనున్న నేపథ్యంలో తిమ్మాపూర్ మండలం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేశారు. అదేవిధంగా మానకొండూర్ మండలానికి సంబంధించిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శనివారం సందర్శించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోని ప్రతి కౌంటర్ ను, ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లనున్న ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. ఎన్నికల సామాగ్రిని చెక్ లిస్ట్ ప్రకారం క్షుణ్ణంగా తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే జోనల్, రూట్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటిస్తూ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు జిల్లాకేంద్రానికి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు.





బీజేపీ సర్పంచులు గెలిచిన గ్రామాలను అభివృద్ధి చేస్తా

- గెలిచిన ప్రజా ప్రతినిధులను సన్మానించిన కేంద్ర మంత్రి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 13: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుండి గెలిచిన సర్పంచ్ లు అసూయ పడేలా బీజేపీ సర్పంచులున్న గ్రామాలను అభివృద్ధి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని, ఖర్చు చేస్తున్న నిధులను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ లో ఎందుకు ఉన్నామా? అని ఆయా పార్టీల సర్పంచులు నామోషి అయ్యేలా చేస్తానని చెప్పారు. గ్రామ పంచాయతీ తొలి దశ ఎన్నికల్లో గెలిచిన బీజేపీ బలపర్చిన సర్పంచ్, ఉప సర్పంచ్ లతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈరోజు కరీంనగర్ కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్ లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులను బండి సంజయ్ ఘనంగా శాలువా కప్పి సన్మానించారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి లేనప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు గట్టి పోటీనిచ్చి గెలిచిన బీజేపీ సర్పంచులను ఈ సందర్భంగా బండి సంజయ్ "హీరో"లుగా అభివర్ణించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ "రాబోయే రోజుల్లో సర్పంచులపై తీవ్ర మైన ఒత్తిళ్లు వచ్చే అవకాశముంది. ఎందుకంటే గ్రామాల్లో అభివృద్ధి పనులన్నీ కుంటుపడ్డాయి. తట్టెడు మట్టి ఎత్తిపోయడానికి కూడా పైసల్లేవు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నయాపైసా ఇచ్చే పరిస్థితి లేదు." అని చెప్పారు. అయినా బీజేపీ నుండి గెలిచిన సర్పంచ్ లు ఎవరూ బాధపడొద్దని, వారికి అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఎంపీ లాడ్స్, సీఎస్సార్ ఫండ్స్ తోపాటు కేంద్రం నుండి వచ్చే నిధులను ఆయా గ్రామాల అభివృద్ధికి వెచ్చిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నుండి గెలిచిన సర్పంచ్ లు, ఉప సర్పంచులకు బీజేపీలోకి వస్తే ఆయా గ్రామాలను కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సహకరిస్తానని చెప్పారు. అయితే ఈనెటల 18లోపు మాత్రమే ఆయా పార్టీల సర్పంచులు బీజేపీలో చేరడానికి డెడ్ లైన్ విధిస్తున్నట్లు చెప్పారు. ఆ తరువాత వస్తానని చెప్పినా ఎవరినీ బీజేపీలో చేర్చుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని, అది తీవ్రస్థాయికి చేరకముందే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోందన్నారు. అతి త్వరలోనే ఆయా ఎన్నికలు కూడా జరిగే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ కార్యకర్తలతోపాటు కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులంతా ఆయా గ్రామాల్లో బీజేపీ గెలుపు కోసం ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. దీంతోపాటు రెండో, మూడో దశ పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సర్పంచ్ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిని గోపి, బీజేపీ నాయకులు చెన్నమనేని వికాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రలోభాలకు ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పారు

- భవిష్యత్ బీఆర్ఎస్ దే
- బీఆర్ఎస్ సర్పంచులకు శుభాకాంక్షలు
- మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు



ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 13:-కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దురాహంకారంతో పోలీసుల బలంతో ఎన్ని ఇబ్బందులు పెట్టినా, ప్రలోభాలకు గురిచేసినా తట్టుకొని నిలబడి విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచుల పోరాట పటిమ అద్భుతమని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రశంసించారు.మెదక్ జిల్లా పాపన్నపేట,హవెలిఘనపూర్ మండలాల్లో బీఆర్ఎస్ మద్దతుతో విజయం సాధించిన 26 మంది నూతన సర్పంచులు మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హరీష్ రావు నివాసంలో వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన సర్పంచులను శాలువాలతో సత్కరించి హరీష్‌రావు అభినందించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ..అధికారాన్ని, పోలీసులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికలకు తెలంగాణ ప్రజలు ఓటుతోనే గట్టి గుణపాఠం చెప్పారనీ మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు.డబ్బు సంచులతో ప్రలోభ పెట్టాలని చూసినా, బెదిరింపులకు పాల్పడినా ప్రజలు మాత్రం గులాబీ జెండా వైపే నిలిచారనీ పేర్కొన్నారు.నామినేషన్ల దశ నుంచే మన అభ్యర్థులను ఏకగ్రీవాల పేరుతో భయభ్రాంతులకు గురిచేశారనీ తెలిపారు అయినా మన కార్యకర్తలు,నాయకులు గులాబీ జెండాను వదలలేదు అన్నారు.ఈ గెలుపు బీఆర్ఎస్ కార్యకర్తల మనోధైర్యానికి నిదర్శనం అన్నారు.ఉమ్మడి మెదక్ జిల్లాలోనే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని ఈ ఫలితాలు స్పష్టం చేశాయనీ పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కాంగ్రెస్ పార్టీ అమలు చేయలేదు అన్నారు. పైగా మాజీ సీఎం కేసీఆర్ ఇస్తున్న పథకాలకు కోతలు పెట్టి మోసం చేశారనీ గుర్తు చేశారు.ఈ మోసాన్ని ప్రజలందరూ గమనించాలని సూచించారు. ఈ గ్రామ పంచాయతీఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పారనీ తెలిపారు.ముఖ్యంగా గిరిజన తండాల్లో మన అభ్యర్థులు, గిరిజన బిడ్డలు సర్పంచులుగా గెలవడం చాలా సంతోషకరం అన్నారు. ప్రజలు కేసీఆర్ నాయకత్వం కోసం, బీఆర్ఎస్ పాలన కోసం ఎదురుచూస్తున్నారనీ చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు మెజారిటీ స్థానాల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులే గెలిచారనీ పేర్కొన్నారు. ప్రభుత్వం సహకరించకపోయినా మీరు ధైర్యంగా ఉండండి. మీ వెనుక పార్టీ ఉంది, కేసీఆర్ ఉన్నారనీ దీమా వ్యక్తం చేశారు. మీరంతా మీ గ్రామాల అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేయలని నూతన సర్పంచి ఎన్నికైన సర్పంచ్ లకు సూచించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మ దేవేందర్ రెడ్డి ,మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, సీనియర్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, హవెలి ఘనపూర్, పాపన్నపేట్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, వివిధ మండల నాయకులు ఈద మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



థాంక్యూ తిరువనంతపురం. కార్పొరేషన్‌లో కేరళ రాజకీయాల్లో కీలక మలుపు. రాష్ట్ర అభివృద్ధి ఆకాంక్షలను మా పార్టీ మాత్రమే తీర్చగలదని ప్రజలు నిశ్చయించుకున్నారు. యూడీఎఫ్, ఎల్డీఎఫ్‌తో కేరళ విసిగిపోయింది. వికసిత్ కేరళకు, సుపరిపాలనకు మరో ఆప్షన్‌గా ఎన్డీయేను ప్రజలు చూస్తున్నారు. బీజేపీ, ఎన్డీయేకు ఓటు వేసిన వారికి కృతజ్ఞతలు.

- ప్రధాని నరేంద్ర మోడీ



తిరువనంతపురం కార్పొరేషన్ బీజేపీ కైవసం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, తిరువనంతపురం, డిసెంబర్ 13: కేరళలోని తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్, కాంగ్రెస్ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు గట్టి దెబ్బ తగిలింది. భారతీయ జనతా పార్టీ సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ విజయకేతనం ఎగురవేసింది. 101 వార్డులకు జరిగిన ఎన్నికల్లో 50 వార్డులను బీజేపీ కైవసం చేసుకుంది. ఎల్‌డీఎఫ్ 29 వార్డుల్లో గెలుపు సాధించగా, 19 వార్డులను యూడీఎఫ్ సొంతం చేసుకుంది. రెండు వార్డుల్లో ఇండిపెండెంట్లు గెలిచారు. తిరువనంతపురంలో ఇంతకుముందు 2020లో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగగా, ఎల్‌డీఎఫ్ 52 వార్డులు గెలుచుకుని విజయకేతనం ఎగురవేసింది. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే 33 వార్డులు, యూడీఎఫ్ 10 వార్డులు దక్కించుకున్నాయి. కాగా, వచ్చే ఏడాది కేరళ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా తాజాగా జరిగిన తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికల్లో బీజేపీ గెలుపు సాధించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. 45 ఏళ్ల తర్వాత కామ్రేడ్ల కోటలో బీజేపీ పాగా వేయడం రాజకీయవర్గాల్లో ఆసక్తిని కలిగిస్తోంది.

విశ్వ వీక్షణం



ఫీజు పెంచే అధికారం ట్రంప్‌కు లేదు

- భారత్‌పై విధించిన సుంకాలనూ రద్దు చేయాలి
- కోర్టుకెక్కిన అమెరికా రాష్ట్రాలు

వాషింగ్టన్, డిసెంబర్ 13: హెచ్ 1బీ వీసా ఫీజును 1 లక్ష డాలర్లకు(రూ. 90 లక్షలు) పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకోవాలని కోరుతూ కాలిఫోర్నియాతోపాటు మరో 19 అమెరికన్ రాష్ట్రాలు శుక్రవారం బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీసా జారీకి అయ్యే నిర్వహణ ఖర్చులను మాత్రమే ఇమిగ్రేషన్ అధికారులు వసూలు చేయాల్సి ఉంటుందని, కాని ఫెడరల్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఫీజును విధించే అధికారం అధ్యక్షుడికి లేదని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రోబ బోంటా కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. హెచ్ 1బీ వీసా ఫీజు పెంపుతో విదేశీ నిపుణుల కొరత ఏర్పడగలదని, దీని వల్ల వివిధ రంగాలు నష్టపోయే అవకాశం ఉందని రాష్ట్రాలు వాదించాయి. విద్య, ఆరోగ్యం, ఇతర అత్యవసర సర్వీసులలో దీని ప్రభావం తీవ్రంగా ఉండగలదని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. న్యూయార్క్‌లోని ఆరోగ్య సిబ్బందిలో మూడు వంతుల మంది విదేశీ ఉద్యోగులే ఉన్నారని, అదే యూనివర్సిటీలు, దవాఖానలలో హెచ్ 1బీ వీసాలపై పనిచేస్తున్న నిపుణులే అధికంగా ఉన్నారని పిటిషనర్లు పేర్కొన్నారు. భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 50 శాతం సుంకాలు విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన నేషనల్ ఎమర్జెన్సీ డిక్లరేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అమెరికా ప్రతినిధుల సభకు చెందిన ముగ్గురు సభ్యులు శుక్రవారం ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. భారత్‌పై ట్రంప్ విధించిన సుంకాలు అమెరికన్ ఉద్యోగులకు, వినియోగదారులకు, ద్వైపాక్షిక సంబంధాలకు హానికరంగా మారిందని వారు తమ తీర్మానంలో అభివర్ణించారు. సభ్యులు దేమోరా రాస్, మార్క్ వీసీ, రాజా కృష్ణమూర్తి ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గ్రాడ్యుయేషన్ తర్వాత భారత్, చైనా సహా అనేక దేశాల విదేశీ విద్యార్థులను అమెరికా విడిచి వెళ్లేలా బలవంతం చేస్తున్న ప్రస్తుత నిబంధనలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శలు గుప్పించారు. గురువారం వైట్‌హౌస్‌లో జరిగిన ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పరిస్థితిని 'అవమానకరం'గా అభివర్ణించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విద్యార్థులలో కొందరికి అమెరికా దేశం విద్యను అందించి, వారు డిగ్రీలు పూర్తి చేసిన తర్వాత వారిని వెనక్కి పంపిస్తోందని అన్నారు. వీసా కొత్త నిబంధనల వల్ల అమెరికా కంపెనీలు విదేశీ గ్రాడ్యుయేట్లను ఉంచుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు.



ముంబైలో అనుమానిత బ్యాగుల కలకలం

- భారత్‌పై విధించిన సుంకాలనూ రద్దు చేయాలి

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 13: దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో గత నవంబర్ 10న జరిగిన బాంబు దాడి ఘటనలో 15 మంది చనిపోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. దీంతో దేశ వ్యాప్తంగా ముఖ్య నగరాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. ఈ క్రమంలోనే ముంబయిలోని బాంద్రాలో 2 బ్యాగులు తీవ్ర కలకలం రేపాయి. బాంద్రాలోని లింకింగ్ రోడ్‌లో నేషనల్ కాలేజ్ ఎదురుగా రెండు అనుమానాస్పద బ్యాగులు చూసి జనం భయంతో పరుగులు తీశారు. స్థానికంగా ఉన్న దుకాణదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్నారు పోలీసులు. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. బాంబ్ స్క్వాడ్ సిబ్బంది దాదాపు 20 నిమిషాల పాటు బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో ఎలాంటి ప్రమాదకర వస్తువులు లేవని నిర్ధారించారు. కాగా, ఆ రెండు బ్యాగులు గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఓ జంటకు చెందినవని.. వారు కాఫీ తాగేందుకు వచ్చి తమ బ్యాగులను అక్కడే వదిలేసి వెళ్లినట్లు సమాచారం. మొత్తానికి ఆ బ్యాగుల్లో ఏమీ లేకపోవడంతో పోలీసులు, జనం ఊపిరి పీల్చుకున్నారు. దీంతో అక్కడి పోలీసులు ఎలాంటి ప్రమాదంలేదని చెప్పి ట్రాఫిక్ క్లియర్ చేశారు. స్థానికంగా ఉన్న షాపులు తెరిచుకున్నాయి. ఈ సందర్భంగా పోలీస్ అధికారి మాట్లాడుతూ.. ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, వాహనాలు కనిపిస్తే.. వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.

ప్రజా తీర్పును గౌరవించాలి..

- బీజేపీని అభినందించిన శశి థరూర్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 13: తిరువనంతపురం స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన భారతీయ జనతా పార్టీ ని కాంగ్రెస్ పార్టీ తిరువనంతపురం ఎంపీ శశథరూర్ అభినందించారు. ప్రజాతీర్పును తప్పనిసరిగా గౌరవించాల్సిందేనని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. తన సుదీర్ఘ పోస్ట్‌లో కాంగ్రెస్ సారథ్యంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌ను సైతం ఆయన ప్రశంసించారు. కేరళ అభివృద్ధికి యూడీఎఫ్ కట్టుబడి ఉందని అన్నారు. 'కేరళ స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన ఫలితాలు వచ్చిన రోజు ఇది. తీర్పు చాలా స్పష్టంగా ఉంది. ప్రజాస్వామ్య స్ఫూర్తి తొణికిసలాడుతోంది' అని శశిథరూర్ సంతోషం వ్యక్తం చేశారు. తిరువనంతపురంలో చారిత్రక పనితీరును బీజేపీ ప్రదర్శించిందని, సిటీ కార్పొరేషన్‌ను గెలుచుకున్నందుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. 45 ఏళ్ల లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ అవకతవకల పాలనకు వ్యతిరేకంగా మార్పు కోరుతూ తాను ప్రచారం సాగించానని, అయితే ఇదే తరహాలో మార్పు కోరుతున్న మరో పార్టీకి అంతిమంగా ఓటర్లు తీర్పునిచ్చారని చెప్పారు. స్థానిక సంస్థలకు రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో ఎక్కువ వార్డులను కైవసం చేసుకున్న యూడీఎఫ్‌ను సైతం ఆయన అభినందించారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో తాజా ఫలితాల ద్వారా ప్రజలు శక్తివంతమైన సంకేతాలనిచ్చారని అభివర్ణించారు. కష్టపడి పనిచేయడం, స్పష్టమైన ప్రభుత్వ వ్యతిరేకత కారణంగా 2020 కంటే మంచి ఫలితాలను సాధించామన్నారు. కేరళ అభివృద్ధికి పునరకింతమై పనిచేస్తామని, సుపరిపాలనకు కట్టుబడి మునుముందుకు దూసుకు వెళ్తామని అన్నారు.



క్లీన్ కిచెన్... ఎలా?



మన ఇంట్లో చాలా తొందరగా మురికిగా మారే గదుల్లో కిచెన్ ఒకటి. అందుకే ఆడవాళ్లు కిచెన్ రూంని క్లీన్ చేయడానికి గంటల సమయం తీసుకుంటారు. కానీ కొన్ని సింపుల్ చిట్కాలను పాటిస్తే మాత్రం నిమిషాల్లో చకచకా క్లీన్ చేయొచ్చు.

వంటగదిని క్లీన్ చేయడం అంత ఈజీ కాదు. అందుకే ఆడవాళ్లు గంటలకు గంటలు వంటింటిని క్లీన్ చేస్తుంటారు. అలాగే క్లీనింగ్ కోసం రకరకాల చిట్కాలను ఫాలో అవుతుంటారు. నిజానికి వంటింటిని క్లీన్ చేయడం ఆడవాళ్లకు పెద్ద తలనొప్పిగా మారుతుంది. కానీ కొన్ని చిట్కాలను పాటిస్తే మాత్రం కేవలం నిమిషాల్లోనే వంటగదిని నీట్ గా చేయొచ్చు. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం పదండి.

పాత బట్టలతో శుభ్రం

ప్రతి ఒక్కరి ఇంట్లో పాత దుస్తులు ఖచ్చితంగా ఉంటాయి. ఇవి వేటికీ పనికిరావని చాలా మంది అనుకుంటుంటారు. కానీ ఈ పాత బట్టలను ఎన్నింటికో వాడొచ్చు. అవును వీటితో ఎన్నో రకాల పనులను కంప్లీట్ చేయొచ్చు. ముఖ్యంగా పాత దుస్తులను ఉపయోగించి వంటింటిని తలతలా మెరిసేలా చేయొచ్చు.

కిచెన్ సింక్ క్లీన్

కిచెన్ లో తొందరగా మురికిగా మారే ప్లేస్ ఏదైనా ఉందంటే అది డిష్ వాషింగ్ సింక్ అనే చెప్పాలి. ఎందుకంటే దీనిలో తిన్న ప్లేట్లు, గ్లాసులు, వండిన గిన్నెలు పేరుకుపోతాయి. దీనివల్ల కిచెన్ లో దుర్వాసన వస్తుంది. అలాగే ఈగలు, బొద్దింకలు కూడా వస్తాయి. అందుకే కిచెన్ లో రెగ్యులర్ గా క్లీన్ చేయాల్సిన వాటిలో సింక్ ముందుంటుంది. అయితే సింక్ లో దుర్వాసన రాకూడదన్నా.. మురికిగా మారకూడదన్నా.. దాంట్లో అన్నం, కూరలు వంటి మిగిలిన పదార్థాలను వేయకూడదు. అలాగే దీన్ని క్రమం తప్పకుండా క్లీన్ చేసుకుంటూ ఉండాలి. లేదంటే మురికిగా మారుతుంది. అయితే బేకింగ్ సోడాతో సింక్ చాలా తొందరగా శుభ్రమవుతుంది.





గ్యాస్ బర్నర్ క్లీనింగ్

చాలా మంది రాత్రివంట పూర్తైన తర్వాత గ్యాస్ స్టవ్ ను క్లీన్ చేస్తుంటారు. కానీ ఈ క్లీనింగ్ గ్యాస్ స్టవ్ బాడీకి మాత్రమే. దీనివల్ల గ్యాస్ స్టవ్ పై మురికి కనిపించదు. కానీ గ్యాస్ బర్నర్ మాత్రం నల్లగా మారుతుంది. దీనివల్ల మంట కూడా సరిగ్గా రాదు. ఎందుకంటే వాటి రంధ్రాల్లో దుమ్ము, ధూళి బాగా పేరుకుపోతాయి. దీనితో మంట రాదు. లేదా చాలా వరకు తగ్గుతుంది. కాబట్టి గ్యాస్ స్టవ్ తో పాటుగా బర్నర్లను కూడా క్లీన్ చేసుకోవాలి.

ఇత్తడి సామాగ్రి

ఇత్తడి ఒక లోహం. ఇది చూడటానికి బాగున్నా.. టైంకి క్లీన్ చేయకపోతే మాత్రం తొందరగా నల్లగా, పాతగా అవుతాయి. మీరు గమనించారో లేదో ఇత్తడి ప్లేట్లు, గ్లాసులు వంటి ఇత్తడి పాత్రలే తుప్పు పడుతుంటాయి. ఇలాంటి వాటిని క్లీన్ చేయడం చాలా కష్టం. అందుకే ఎప్పటికప్పుడు వీటిని కూడా క్లీన్ చేసుకుంటూ ఉండాలి. దీనివల్ల క్లీనింగ్ కు ఎక్కువ సమయం కేటాయించాల్సిన అవసరం ఉండదు.

టైల్స్ క్లీన్

కిచెన్ స్లాబ్ ను, స్టవ్ ను క్లీన్ చేస్తే సరిపోదు. కిచెన్ టైల్స్ ను కూడా క్లీన్ చేయాలి. దీన్ని ఒక్క రోజు క్లీన్ చేయకుండా వదిలేస్తే గ్యాస్ ముందున్న టైల్స్ పై నూనె ఆవిరి, మసాలా దినుసులు చిల్లుతాయి. దీంతో ఆ టైల్స్ కు దుమ్ము, ధూళి పేరుకుపోతాయి. దీంతో టైల్స్ మురికిగా కనిపిస్తాయి. అందుకే టైల్స్ ను కూడా ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకుంటూ ఉండాలి.

ఉన్ని దుస్తులను ఉతకండి ఇలా...

వేసవిలో బట్టలను దుస్తులను జాగ్రత్తగా చూసుకోవడం కంటే చలికాలంలో దుస్తులను జాగ్రత్తగా చూసుకోవడం పై మనం కచ్చితంగా దృష్టి సారించాలి. ఉన్ని బట్టలు సరిగ్గా ఉతకకపోతే, మీ బట్టలు త్వరగా పాడవుతాయి. ఉన్ని బట్టలు ఉతకడానికి మీరు ఈ చిట్కాలను పాటిస్తే, మీరు మీ దుస్తులను డ్రై క్లీనింగ్ కోసం కూడా పంపాల్సిన అవసరం లేదు.

మీరు ఈ చలికాలంలో ఉన్ని బట్టలు ఉతకడంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే అవి పాడవకుండా ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి.

వేడి నీటిని ఉపయోగించవద్దు

ఉన్ని బట్టలు ఉతకడానికి వేడి నీటిని ఉపయోగించకూడదు. వేడి నీరు వాడడం వల్ల ఉన్ని బట్టల నాణ్యత త్వరగా పాడవుతుంది. బట్టల ఆకృతి పాడవుతుంది. మీ బట్టలు పాడైపోకుండా కాపాడుకోవాలనుకుంటే, చల్లని నీటిని వాడండి. మీకు కావాలంటే, మీరు వేడి నీటికి బదులుగా గోరువెచ్చని నీటిని ఉపయోగించవచ్చు.

మృదువైన చేతులతో బట్టలు ఉతకాలి

ఉన్ని బట్టలు రుద్దడం లేదా ఉతకడం ద్వారా, మీరు తెలిసో తెలియకో బట్టల మన్నికను తగ్గిస్తుంది. ఉన్ని బట్టలు సున్నితంగా ఉంటాయి కాబట్టి వాటిని ఉతికేటప్పుడు తేలికైన చేతులను వాడాలి. బట్టలు ఉతికిన తర్వాత గట్టిగా పిండకూడదు. ఇది కాకుండా, మీరు నాణ్యమైన డిటర్జెంట్ వాడాలి. చాలా కఠినమైన రసాయనాలతో డిటర్జెంట్లను ఉపయోగించడం మానుకోండి. స్వెటర్లు లేదా ఉన్ని బట్టలు ఆరబెట్టడానికి ఎప్పుడూ వేలాడదీయకూడదని తెలిస్తే మీరు ఆశ్చర్యపోవచ్చు. స్వెటర్‌ను ఆరబెట్టడానికి ఫ్లోర్ లాంటి వాటిపైనే ఆరబెట్టాలి. ఈ చిట్కాను అనుసరించడం ద్వారా, మీ స్వెటర్ అస్సలు కుంచించుకుపోదు, అంటే మీ ఉన్ని బట్టల ఆకృతి చెడిపోదు. ఈ చలికాలంలో, ఉన్ని బట్టలు ఉతికే ముందు, ఖచ్చితంగా ఈ చిట్కాలను మీ మనస్సులో ఉంచుకోండి.





హైదరాబాద్ రావడం ఆనందంగా ఉంది

ఫుట్ బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీ హైదరాబాద్‌లో మస్త్ ఖుషీగా గడిపాడు. గోట్ ఇండియా టూర్‌లో భాగంగా శనివారం హైదరాబాద్ విచ్చేసిన మెస్సీ.. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ స్టేడియంలో అభిమానులను ఉర్రూతలూగించాడు. అలాగనీ జెర్సీ ధరించి మైదానంలోకి దిగి తన మార్క్ గోల్స్‌తో ఈ స్టార్ ప్లేయర్ చెలరేగలేదు. కానీ, ఆద్యంతం నవ్వుతూ, ఉత్సాహంగా సందడి చేశాడీ సాకర్ మాంత్రికుడు. అనంతరం బహుమతి ప్రదాన కార్యక్రమంలో మట్లాడుతూ.. 'హైదరాబాద్ వచ్చి మిమ్మల్ని కలుసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంద'ని ఫ్యాన్స్‌ను ఉద్దేశించి అన్నాడు. భారత పర్యటనలో కోల్‌కతాలో తన నిలువెత్తు 70 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించిన మెస్సీ శనివారం హైదరాబాద్ వచ్చేశాడు. సహచరులు సూరెజ్, రొడ్రిగో డిపాల్‌తో కలిసి ఉప్పల్ మైదానం చేరుకున్న అర్జెంటీనా స్టార్.. సీఎం రేవంత్ రెడ్డితో కలిసి సరదా ఫుట్ బాల్ ఆడాడు. ఆ తర్వాత విజేతలుగా నిలిచిన సింగరేణి ఆర్ఆర్ జట్టుకు ట్రోఫీని ప్రదానం చేశాడు మెస్సీ. అనంతరం మాట్లాడిన అతడు.. ప్రతిఒక్కరికి హలో.. ఈరోజు నాకోసం ఇక్కడి వచ్చినందుకు.. నాకు గొప్పగా స్వాగతం పలికినందుకు మీకు ధన్యవాదాలు. ఇక్కడికి రావడానికి ముందు నేను చాలా విషయాలు చూశాను. మీరు నాపై చూపిన ప్రేమాభిమానులు చిరకాలం గుర్తుండిపోతాయి అని చెప్పాడు. గోట్ ఇండియా టూర్‌లో మూడో అడుగు ముంబైలో వేయనున్నాడు మెస్సీ. డిసెంబర్ 14, ఆదివారం అక్కడ కొన్ని కార్యక్రమాల్లో పాల్గొని.. డిసెంబర్ 15 ఆదివారం ఢిల్లీలో మెస్సీ సందడి చేయనున్నాడు.



స్క్వాష్ వరల్డ్ కప్‌లో ఫైనల్‌కి...

స్వదేశంలో జరుగుతున్న స్క్వాష్ వరల్డ్ కప్‌లో భారత జట్టు సరికొత్త చరిత్ర సృష్టించింది. నిరుటి ఎడిషన్‌లో కాంస్యం గెలిచి ఈసారి కచ్చితంగా పతకం రంగు మార్చాలన్న పట్టుదలతో బరిలోకి దిగిన భారత్.. సెమీస్‌లో 30తో డిఫెండింగ్ చాంపియన్స్ ఈజిప్ట్‌ను మట్టికరిపించి ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. తద్వారా ఈ టోర్నీ చరిత్రలో తొలిసారి ఫైనల్స్ చేరి రికార్డు సృష్టించింది.టోర్నీ ఆసాంతం రాణిస్తున్న వెలవన్ సెంథిల్ కుమార్, అన్హత్ సింగ్, అభయ్ సింగ్ వరుస విజయాలతో ఈజిప్ట్‌కు షాక్ తప్పలేదు. టైటిల్ పోరులో భారత జట్టు హాంకాంగ్‌తో తలపడుతుంది.



ఫైనల్ లో ఉన్నతి, ఇషా

ఒడిశా మాస్టర్స్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు ఉన్నతి హుడా, ఇషారాణి బరూచ మహిళల సింగిల్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల్లో భారత్‌కు చెందిన కిరణ్ జార్జ్ టైటిల్‌పోరులో నిలిచాడు. శనివారం ఇక్కడ జరిగిన మహిళల సెమీఫైనల్లో టాప్‌సీడ్ ఉన్నతి 1821, 2116, 2116తో భారత్‌కే చెందిన తస్నీమ్ మీర్‌పై విజయం సాధించగా.. ఇషారాణి 1821, 217, 217తో సహచర షట్లర్ తన్వీ హేమంత్‌ను ఓడించాడు. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో రెండో సీడ్ కిరణ్ జార్జ్ 2119, 821, 2118తో సహచర ఆటగాడు రోనక్ చౌహాన్‌పై గెలుపొందాడు. శనివారం జరిగే తుది పోరులో ఇండోనేసియా షట్లర్ మహ్మద్ యూసుఫ్ తో కిరణ్ అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని భట్/శిఖా గౌతమ్ ద్వయం, మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్లో భారత జోడీలు ఎస్ కనపురం/ఉదయసూర్యన్, సాత్విక్ రెడ్డి/రేషిక ప్రత్యర్థుల చేతిలో ఓటమిపాలై ఫైనల్స్‌కు ముందే వెనుదిరిగారు.




ఆటలు

@prathipaksham
prathipaksham tv telugu

'చిన్న స్వామి'లో ఐపీఎల్ మ్యాచులకు షరతులు

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం మళ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లతో కళకళలాడనుంది. తొక్కిసలాట తర్వాత వెలవెలబోతున్న ఈ మైదానంలో మ్యాచ్‌ల నిర్వహణకు కర్నాటక ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇటీవలే రాష్ట్రం నుంచి ఐపీఎల్ మ్యాచ్‌లను తరలిపోనివ్వమని చెప్పిన డిప్యూటీ సీఎం శివకుమార్ తమ సర్కార్ తరఫున చేయాల్సిన ఏర్పాట్లన్నీ చేశారు. అంతేకాదు బెంగళూరు ఇమేజ్‌ను కాపాడేందుకు అవసరమైన జాగ్రత్తలు, షరతులు తప్పనిసరని ఆయన వెల్లడించారు. జూన్ 4న తొక్కిసలాట తర్వాత చిన్నస్వామి స్టేడియంలో భద్రతా లోపాలు ఉన్నాయని ఏకసభ్య కమిషన్ తీర్పునిచ్చింది. అందుకని పోలీసులు కర్నాటక క్రికెట్ సంఘానికి ఎన్‌ఓసీ ఇవ్వడం లేదు. దాంతో.. స్వతంత్ర సభ్యుడి నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం కర్నాటక ప్రభుత్వం పావులు కదిపింది. కేఎస్‌సీఏకు అన్ని విధాలా సహకరించిన కర్నాటక సర్కార్ చిన్నస్వామికి పూర్వవైభవం తీసుకురానుంది. 'ఐపీఎల్ మ్యాచ్‌ల గురించి నిర్ణయానికి వచ్చాం. ఈసారి బెంగళూరు ఆతిథ్యమిస్తుందని నమ్మకంతో ఉన్నాం. కర్నాటక క్రికెట్ సంఘం అధికారులతో సమావేశం భద్రతా, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన చర్యలపై చర్చించాలని హోం మంత్రి జి.పరమేశ్వరను కోరాం. చిన్నస్వామిలో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిపి తీరుతాం. తొక్కిసలాట జరిగిందనే సాకుతో బెంగళూరు ప్రతిష్టను దెబ్బతీయాలనుకోవడం సమంజసం కాదు' అని శివకుమార్ పేర్కొన్నారు.





దేశం, ధర్మం, దైవ భావనలను తెలియజెప్పే 'అఖండ 2'

ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్


ఇటీవల విడుదలైన 'అఖండ 2' సినిమా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దేశం, ధర్మం, దైవం వంటి భారతీయ శాశ్వత విలువలను నేటి తరానికి అర్థవంతంగా, ప్రభావవంతంగా చేరవేసే కథాంశంతో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 'అఖండ 2' చిత్రాన్ని ప్రశంసిస్తూ, సినిమా అఖండ విజయాన్ని సాధించాలని దర్శకుడు బోయపాటి శ్రీను ని ఆశీర్వదించారు. సమాజానికి సానుకూల దిశను చూపించే, విలువలతో కూడిన చిత్రాలు మరింతగా రావాలని ఆయన ఆకాంక్షించారు.

'మన శంకర వర ప్రసాద్ గారు'

షూటింగ్ పూర్తి, జనవరి 12న గా రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి మాస్‌అండ్‌ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. బ్లాక్‌బస్టర్ హిట్ మెషిన్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఆకట్టుకునే ప్రమోషనల్ కంటెంట్, దూకుడుగా సాగుతున్న ప్రచార కార్యక్రమాలతో సంచలనం సృష్టిస్తోంది. విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. ఈ రోజు చిత్ర నిర్మాతలు సినిమా విడుదల తేదీని ప్రకటించడానికి ఒక గ్రాండ్ ఈవెంట్ ని నిర్వహించారు. 'మన శంకర వర ప్రసాద్ గారు' పూర్తి షూటింగ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రం సంక్రాంతికి కేవలం 2 రోజుల ముందు, జనవరి 12న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం విడుదల కావడం వల్ల, ఈ చిత్రం ఏడు రోజుల లాంగ్ వీకెండ్ బెనిఫిట్ పొందుతుంది. పండుగ సెలవుల పూర్తిగా కలిసిరానున్నాయి. మంచి ప్లానింగ్ తో చేసిన రిలీజ్ టైం సంక్రాంతి సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద సినిమాకు బలమైన వసూళ్లను అందించి, ప్రేక్షకుల రష్ ని గరిష్ఠంగా పెంచుతుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి యంగ్ అండ్ డైమనిక్ గా కనిపించిన రిలీజ్ డేట్ పోస్టర్ అదిరిపోయింది. రెడ్ కార్ పై బ్లాక్ సూట్ లో కాఫీ సిప్ చేస్తూ మెగా స్వాగ్ తో మెస్మరైజ్ చేశారు చిరంజీవి.





'దేఖ్‌లేంగే సాలా'

'ఉస్తాద్ భగత్ సింగ్' తొలి గీతం వేడుక

'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్‌లేంగే సాలా' విడుదలైంది. ఈ గీతావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం రాజమండ్రిలో జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, నిర్మాత నవీన్ యెర్నేని, గీత రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి విడుదలైన తొలి గీతం 'దేఖ్‌లేంగే సాలా' అభిమానులు, సినీ ప్రేమికుల్లో ఒక్కసారిగా భారీ ఉత్సాహాన్ని రేపింది. ఉత్సాహభరితమైన సంగీతం, అద్భుతమైన నృత్య రీతులతో రూపొందిన ఈ పాటలో పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రజాదరణ పొందిన అవతారంలో కనిపిస్తున్నారు. వింటేజ్ స్టైల్, రా ఇంటెన్సిటీతో ఒకప్పుడు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన తన ఐకానిక్ బ్లాక్‌బస్టర్ పాటల జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తున్నారు. ఈ పాటతో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ అనే బ్లాక్‌బస్టర్ త్రయం ఘనంగా మళ్లీ కలిసింది. గతంలో చార్ట్‌బస్టర్ పాటలు, గుర్తుండిపోయే మాస్ ఎంటర్టైనర్లను అందించిన ఈ త్రయం, 'దేఖ్‌లేంగే సాలా'తో తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. పదునైన దృష్టి, విశిష్టమైన సంగీత అవగాహనకు పేరుగాంచిన దర్శకుడు హరీష్ శంకర్.. మాస్, ఆధునిక అంశాలను మేళవిస్తూ రూపొందించిన ఈ పాటలో తన నైపుణ్యాన్ని మరోసారి నిరూపించారు. ప్రతి బీట్, ప్రతి స్టెప్, ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాటకు సమగ్ర ఆకర్షణను తీసుకొచ్చారు.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200